ప్రజాశక్తి

సోమవారం 15 జనవరి 2024 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా


బరిలో కోఢీ



- ఉమ్మడి కృష్ణాజిల్లాలో జోరుగా కోడి పందేలు
- పోలీసు హెచ్చరికలు బేఖాతరు
- యథేచ్ఛగా గుండాట, పేకాట, కోతముక్క
- ఏరులై పారిన మద్యం
- పలుచోట్ల ఘర్షణలు

పోలీసుల ఎన్ని హెచ్చరికలు చేసినప్పటికీ ఖాతరు చేయకుండా విజయవాడ శివారు సహా కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో కోడిపందేలు ఆదివారం జోరుగా సాగాయి. బరుల వద్ద లక్షలాది రూపాయలు చేతులు మారాయి. కోడిపందేలతో పాటు పేకాట, గుండాట, కోతముక్క వంటి జూద క్రీడలు నిర్వహించారు. మూడు రోజుల పాటు పందేలు నిర్వహించేలా నిర్వాహకులు బరుల వద్ద సకల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. మద్యం ఏరులై పారింది. సంక్రాంతి సంబరాలు పేరుతో ఏటా మాదిరిగానే గన్నవరం నియోజకవర్గం అంపాపురం, విజయవాడ రూరల్ అంబాపురం, కంకిపాడులోని ఈడుపుగల్లులో భారీ బరులు ఏర్పాటు చేసి కోడిపందేలు నిర్వహించారు. అంపాపురంలో సినిమా సెట్టింగ్‌లను తలపించేలా స్వాగత ద్వారాలు, బౌన్సర్లు, సందర్శకులకు పాస్‌లు, ఆటగాళ్లకు టోకెన్‌లు, చేతికి కంకణాల వంటి ఏర్పాట్లతో హంగామా చేశారు. పందేలు చూడటానికి వస్తున్న వాహనదారులతో బరులన్నీ కిటకిటలాడాయి. మచిలీపట్నం నుంచి మంగినపూడి బీచ్‌కు వెళ్లే రోడ్డు పక్కనే మేకవానిపాలెంలో సంక్రాంతి సంబరాల పేరుతో అతిపెద్ద బరి ఏర్పాటు చేశారు. నందిగామ మండలం మున్నేటి తీరంలోని పల్లగిరి శివారు మామిడితోటలు, కంచికచర్ల మండలం గుండేపల్లి, చందర్లపాడు, జగ్గయ్యపేట షేర్ మహమ్మద్ పేట, మంగొల్లు, చిల్లకల్లు, తిరుమలగిరి, అనుమంచిపల్లి, బూధవాడ, వత్సవాయి, తోటచర్ల, నవాబుపేట ప్రాంతాల్లో తదితర చోట్ల భారీ బరులు ఏర్పాటు చేశారు. నందిగామలోని ఐతవరంలో కోడిపందేలను ఎంఎల్‌సి మొండితోక అరుణకుమార్ ప్రారంభించారు. మోపిదేవిలో బరుల వద్ద చిన్నపాటి ఘర్షణ చోటుచేసుకుంది.

...పూర్తి వార్తలు లోపలి పేజీల్లో



ఈడుపుగల్లులో తిరునాళ్లను తలపిస్తోన్న బరి



మైలవరంలో ఏర్పాటు చేసిన బరి



మేకవానిపాలెంలో కోతముక్క

భోగి మంటల్లో జిఒ కాపీలు

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, జిఒల విడుదలపై ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఆదివారం నిరసనలు మిన్నంటాయి. అంగన్‌వాడీల నిరసనలో భాగంగా భోగి పండుగను పురస్కరించుకుని భోగి మంటల్లో జిఒ నెంబరు 2 ప్రతులను వేసి దహనం చేశారు. విజయవాడ ధర్నా చౌక్‌లో పిల్లలకు భోగి పండ్లు పోశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు ఇవ్వకుండా వారిపైనే అక్రమ కేసులు బనాయిస్తూ ప్రభుత్వం చేస్తున్న అసత్య ప్రకటన కాపీలను యుటిఎఫ్ నాయకులు భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు.

... పూర్తి వార్తలు లోపలి పేజీల్లో



విజయవాడలో భోగి మంటల్లో జిఒ కాపీలు వేసి నిరసన తెలుపుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సుబ్బరావమ్మ, బాబూరావు తదితరులు



మచిలీపట్నంలో నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

నెలాఖరుకు మూడో విడత రీ సర్వే పూర్తి

- ఇప్పటి వరకు 246 గ్రామాల్లో భూముల రీ సర్వే
- సర్వే, భూ రికార్డుల శాఖ ఏడి టి.వెంకటేశ్వరరావు





ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

'జగనన్న భూ హక్కు భూ రక్ష పథకంలో భాగంగా ప్రభుత్వం భూములు రీ సర్వే నిర్వహిస్తోంది. కృష్ణాజిల్లాలోనూ నిర్ధేశించిన షెడ్యూల్‌కు అనుగుణంగానే భూముల రీ సర్వే జరుగుతోంది.' అని కృష్ణాజిల్లా సర్వే, భూ రికార్డుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ టి.వెంకటేశ్వరరావు అన్నారు. ఇప్పటి వరకు 246 రెవెన్యూ గ్రామాల్లో 2,34,426 ఎకరాలు, 948 చదరపు కిలోమీటర్లు, 692 మీటర్ల విస్తీర్ణంలో భూముల రీ సర్వే పూర్తయిందని తెలిపారు. మూడో దశ సర్వే జనవరి నెలాఖరుకు పూర్తవుతుందని చెప్పారు. జిల్లాలో జరుగుతున్న భూముల రీసర్వే ప్రక్రియ గురించి ఆయన 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

ప్రశ్న: ఎన్ని రెవెన్యూ గ్రామాల్లో భూముల రీ సర్వే పూర్తయింది ?

జిల్లాలోని 502 రెవెన్యూ గ్రామాల్లోనూ డ్రోన్ ఫ్లయింగ్ పూర్తయింది. 440 గ్రామాలకు ఆర్థో రెక్టిఫై ఇమేజ్ (ఓఆర్‌ఐ)లు తయారయ్యాయి. రెండు దశల్లో 155 గ్రామాల్లో రీసర్వే పూర్తయింది. మూడో దశలో (మిగతా 6లో)

నందిగామ ఎసిపి జనార్ధన్ నాయుడు బదిలీ



ప్రజాశక్తి - నందిగామ : నందిగామ ఎసిపి జనార్ధన్ నాయుడు ఆకస్మికంగా విజయవాడ పోలీస్ కమిషనరేట్ ఆఫీస్‌కు విఆర్‌కు బదిలీ చేశారు. జనార్ధన్ నాయుడు బదిలీ వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

15 నుండి సహాయమాత ఉత్సవాలు

ప్రజాశక్తి - వీరులపాడు : మండల పరిధిలోని జగన్నాధపురంలో ఉన్న సహాయమాత చర్చి ఆవరణంలో ఈ నెల 15 16, 17 తేదీల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఫాదర్ జోసఫ్ సుగుణరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 22 గ్రామాల్లో ఉన్న ఆర్‌సిఎం చర్చి సంఘస్తులు, యాత్రికులు వేలాదిగా సహాయమాత ఉత్సవాలలో పాల్గొంటారని తెలిపారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు.

ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి విసన్నపేట : తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణ నిధి పుట్టినరోజు సందర్భంగా వల్లూరి పాలెంలోని ఆయన నివాసంలో ఆదివారం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి రాజేష్ దంపతులు, వైసిపి సీనియర్ నాయకులు అల్లు గణపతి రెడ్డి, తదితరులున్నారు.

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి- నందిగామ : హిందూ కర్మల కార్యక్రమాలను నిర్వహించుకోవడానికి.. ఆర్‌అండ్‌బి భవనాన్ని వినియోగంలోకి తీసుకువస్తామని ఎంఎల్సి మొండితోక అరుణ్ కుమార్ పేర్కొన్నారు. నందిగామ పట్టణంలో పాత బస్టాండ్ గాయత్రి సేవా సంఘం భవనంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్‌రావు సొంత నిధులతో బ్రాహ్మణులకు నూతన వస్త్రాలను అరుణ్ కుమార్ ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు, వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి దుర్మరణం

జగ్గయ్యపేట: ధర్మవరప్పాడు తండ ఎం సినెల్ ఫ్యాక్టరీ సమీపంలో బండిపై నుండి బైకిస్టు జారిపడి మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం... ఖమ్మం జిల్లా తల్లాడ మండలం వేంకటగిరి గ్రామానికి చెందిన తిరుమలేష్ అనే వ్యక్తి ఎంసిఎల్ మైన్స్‌లో మెకానిక్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విధులకు వెళ్తూ ఎంసిఎల్ గేట్ సమీపంలో బైక్ పై నుంచి జారి పడి మృతి చెందినట్లు సమాచారం. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతు ఆత్మహత్య

జగ్గయ్యపేట: మండలంలోని చిల్లకల్లు గ్రామానికి చెందిన రైతు ఆదినారాయణ శనివారం పురుగుల మందు తాగి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పొలంలో అక్రమంగా విద్యుత్ స్తంభాలు వేయడంతో అధికార పార్టీ నేతల ఒత్తిడికి గురై మనస్తాపం చెంది పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించారు. ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆదినారాయణను జిల్లా టీడిపి అధ్యక్షుడు, మాజీ మంత్రి నెట్టెం శ్రీ రఘురాం పరామర్శించారు.

టిడిపిలో చేరికలు

జగ్గయ్యపేట: పట్టణంలోని 15వ వార్డు చెరువు బజారునకు చెందిన మోపురి వెంకటేశ్వర్లు, కాటుబోయిన కొండస్వామి, సర్వేపల్లి శ్రీనివాస్‌లు అధికార వైసిపి నుండి జగ్గయ్యపేట తెలుగుదేశం పార్టీ యువ నాయకులు శ్రీరాం చిన్న బాబు సమక్షంలో టిడిపిలో చేరారు. వీరికి టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి శ్రీరాం రాజగోపాల్ తాతయ్య కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

టిడిపి నిరసన

ప్రజాశక్తి - భవానీపురం : అధికారంలోకి వచ్చి నేటికి నాలుగున్నరేళ్ళు పూర్తయినా సీఎం జగన్ నెరవేర్చని హామీ పత్రాలను భోగి మంటల్లో తెలుగుదేశం నాయకులు దగ్ధం చేశారు. ఆదివారం పశ్చిమ నియోజకవర్గం నాయకులు ఎంఎస్. బేగ్ సారథ్యంలో టీమ్ టీడీపీ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గం కార్యాలయం నందు భోగిమంటలు వేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి ధనేకుల వెంకట సుబ్బారావు, జిల్లా అధికారి ప్రతినిధి బెవర సాయి సుధాకర్, యేదుపాటి రామయ్య,బీసీ సెల్ అధ్యక్షులు నమ్మి భాను ప్రకాష్, మహిళా విభాగ అధ్యక్షురాలు సుకాశి సరిత, కొట్టేటి సరితా పాల్గొన్నారు.

భోగి మంటల్లో ఎస్మా కాపీలు

34వ రోజుకు అంగన్వాడీల సమ్మె



విజయవాడ బీసెంట్‌రోడ్డులో సంతకాల సేకరణ

ప్రజాశక్తి - విజయవాడ : అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించిన జిఒ నెంబర్ ప్రతులను అంగన్వాడీలు భోగిమంటల్లో వేసి తగులబెట్టారు. షోకాజ్ నోటీసులు వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మె భోగి పండుగ కు 34 వ రోజుకి చేరుకుంది. సమ్మె శిబిరాల్లో అంగన్వాడీ కేంద్రాల పిల్లలకు భోగి పళ్ళు పోసారు. అలంకార్ సెంటర్ ధర్నా చౌక్‌లో సమ్మె శిబిరానికి ఆలిండియా లాయర్స్ యూనియన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్ర ప్రసాద్, ఇతర పలువురు న్యాయవాదులు హజరై సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ అంగన్‌వాడీలను వీధుల్లోకి నెట్టిన పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వానిదని, సమస్యలు పరిష్కరించాల్సిన కర్తవ్యం కూడా ప్రభుత్వంపై ఉందన్నారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జగనన్నకు చెబుదాం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం విస్తతంగా జరుగుతుందని చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.సుప్రజ, నాయకులు జైనీ రత్నకుమారి, ఉమాదేవి, యల్లా రాణి, న్యాయవాది సప్పా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు మద్దతుగా సంతకాల సేకరణ...

సాయంత్రం బీసెంట్ రోడ్ మహంతి మార్కెట్ వద్ద సిఐటియు, హాకర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడీల సమ్మె కు మద్దతుగా సంతకాల సేకరణ చేశారు. ప్రజానీకం ఆదరణ తో ఈ కార్యక్రమం జరిగింది. సమ్మె వివరాలు తెలియ చేస్తూ సంతకాలు చేయించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నేతలు డి.వి.కృష్ణ, ఎన్.సిహెచ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ...పండుగ రోజుల్లోకూడా అంగన్‌వాడీలను రోడ్లమీదకునెట్టిన ఘనత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. ఆరు సార్లు చర్చలు జరిపి ఈ ప్రభుత్వం చేసిందేమిటని ప్రశ్నించారు. రానున్న కాలంలో రాష్ట్రంలోని లక్షలాదిమంది ఉద్యోగ, కార్మికులు ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె. దుర్గా రావు, హాకర్స్ యూనియన్ నేతలు మురళి, భూలోకం, బి. లక్ష్మణ, సోమేశ్వర రావు పాల్గొన్నారు.

తిరువూరు : తహశీల్దార్ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న దీక్షా శిబిరం వద్ద భోగి మంటలు ఏర్పాటు చేసి అంగన్వాడీలపై ఎస్మా ఉపయోగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 2 కాపీలను మంటల్లో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి బలగాని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అంగన్వాడీల వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. అంగన్వాడి వర్కర్లు, ఆయా లు జగనన్నకు చెప్పుకుందామని గ్రామాల్లో చేస్తున్న సంతకాల సేకరణ విజయవంతం చేయాలని.అయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పాల్గొన్నారు. **నందిగామ :** అంగన్వాడీ కార్మికులపై ప్రభుత్వం తీసుకువచ్చిన జిఒ నెంబర్ రెండు ఎస్మా చట్టం కాపీలను సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్మికులు ఆదివారం నందిగామ ఆర్డిఒ కార్యాలయం వద్ద బోగి మంటలు వేసి దగ్దం చేశారు. బోగి పళ్ళు పోసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జానపద నృత్యాలు చేసుకుంటూ జగనన్నకు వ్యతిరేకంగా పాటలు పాడి నిరసన తెలిపారు. ఎస్మా చట్టం కాపీలను వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేశారు. తక్షణమే జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి సుధాకర్, సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ మాట్లాడుతూ 34 రోజులుగా ఆందోళన చేస్తున్న ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించటం తగదన్నారు. ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సయ్యద్ ఖాసిం, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి చనుమ్మెలు సైదులు, సిఐటియు నాయకులు షేక్ లాల్ అహమ్మద్ గౌస్, కర్రి వెంకటేశ్వరరావు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు సరళ, సుజాత, వెంకట్రావమ్మ, పుల్లమ్మ, విజయ, పిచ్చిమ్మ, వాసవి, పలువురు పాల్గొన్నారు. **మైలవరం :** అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె ఆదివారం పండగ పూట కూడా కొనసాగింది. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నుండి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైలవరం జి.కొండూరు మండలాల సిఐటియు కార్యదర్శిలు సిహెచ్ సుధాకర్, బాలకష్ణ, ఐలు నాయకులు రమేష్ బాబు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పుష్పకుమారి, మాణిక్యం, విజయలక్ష్మి, రబ్బాని తదితరులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమంలో భాగంగా ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (సిఐటియు) యూనియన్ ఆధ్వర్యంలో 34వ రోజు ఆదివారం అంగన్వాడీలు, హెల్పర్‌లు అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బోగి పండుగ సందర్భంగా భోగి మంటలు వేసి ఆ మంటల్లో అంగన్వాడీలపై ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగించిన నేపథ్యంలో ఆ ఎస్మా చట్టం పతులను మంటల్లో వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాల బాలికలకు భోగి పండ్లు పోశారు. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎ వెంకటేశ్వరరావు, ప్రజా సఘాల నాయకులు అంగన్వాడీలకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కోటా కష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, బి రాము, రావేళ్ళ శేషు, పాల్గొన్నారు.



విజయవాడ



జగ్గయ్యపేట



మైలవరం



తిరువూరు



నందిగామ

అసత్య ప్రకటన కాపీలు దహనం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : ప్రభుత్వ ఉద్యోగుల వ్యతిరేక న్యూస్‌క్లిప్పింగ్‌లను యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం భోగిమంటల్లో దహనం చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈ కార్యక్రమం యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయం వద్ద మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వంలో భాగమైన ఉద్యోగ, ఉపాధ్యాయులను శత్రువులుగా చూస్తూ... తమకు రావలసిన బకాయిలను సైతం ప్రభుత్వం వాడుకుని... బకాయిలు అడిగినందుకు తిరిగి ఉద్యోగ ఉపాధ్యాయుల పైనే అక్రమ కేసులు పెడుతుందని వీటన్నిటినీ నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టినట్లు యుటిఎఫ్ నాయకులు తెలిపారు. **విస్సన్నపేట :** మండలంలోని యుటిఎఫ్ కార్యాలయం వద్ద ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా 'భోగిమంటల్లో ప్రభుత్వ దహనం' కార్యక్రమ నిర్వహించారు. యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి బి.సిహెచ్.సూర్యనారాయణ, ఏలూరు జిల్లా కార్యదర్శి పి.వీరకోటి, విస్సన్నపేట గౌరవ అధ్యక్షులు బి.వి.రామారావు పాల్గొన్నారు. **నందిగామ :** యుటిఎఫ్ నందిగామ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉపాధ్యాయ, ఉద్యోగుల వ్యతిరేక ప్రభుత్వ జిఒ కాపీలను ఉపాధ్యాయ సంఘాల నాయకులు దగ్ధం చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొద్దుకోలు రమణయ్య మాట్లాడారు. **జగ్గయ్యపేట:** యుటిఎఫ్ జగ్గయ్యపేట మండల శాఖ ఆధ్వర్యంలో టీచర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ కార్యాలయం వద్ద ప్రభుత్వ ఉద్యోగ వ్యతిరేక న్యూస్ పేపర్ క్లిప్స్‌ను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా సహాధ్యక్షులు ఎం.కష్ణయ్య, జిల్లా కార్యదర్శి జె.సుధానంద్, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.పల్లవి, జి.ముక్తేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు యల్.వి.సత్యనారాయణ, మండల శాఖ గౌరవాధ్యక్షులు జి.ప్రవీణ్ కుమార్, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



నందిగామ



విస్సన్నపేట



రెడ్డిగూడెం

భోగి మంటల్లో జిఒ ప్రతులు

- 34వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని లేకుంటే పండగ తర్వాత సమ్మె ఉధృతం చేస్తాం అని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి హెచ్చరించారు. అంగన్వాడి కార్యకర్తలకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచాలని ,గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కృష్ణ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కృష్ణ కలక్టరేట్ ధర్నా చౌక్ లో చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారానికి 34 వ రోజుకు చేరుకుంది.ఈ సందర్భంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని యూటీఫ్ నాయకులు ప్రారంభిం చారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి కె ఏ ఉమ మహేశ్వర రావు మాట్లాడుతూ అంగన్వాడిల న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించే వరకు చేసే పోరాటానికి యు టి ఎఫ్.పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.లెనిన్ బాబు,సిఐటియు నాయకులు బూర సుబ్రహ్మణ్యం, టి. చంద్ర పాల్ సంఘీ భావం తెలిపారు. ఈ సమ్మె లో యూనియన్ జిల్లా కార్యదర్శి ఏ.రమాదేవి, సెక్టార్ అధ్యక్ష ,కార్యదర్శులు నాంచారమ్మ, పి.రెజీనా రాణి,సభ్యులు కే కె.లక్ష్మి ,సుజాత, సౌజన్య, విటలేశ్వరి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు:** కంకిపాడులో అంగన్‌వాడీలు, ప్రజా సంఘాల నాయకులు ఎస్మా కాపీలను భోగిమంటల్లో వేసి నిరసన తెలిపారు. సీఐటీయూ కంకిపాడు మండలకార్యదర్శి తాడంకి నరేష్, కౌలు రైతు సంఘం కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు, ఉప్పాడ త్రిమూర్తులు, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షురాలునళిని కుమారి, ఎం రేవతి, సెక్టార్ లీడర్ రమాదేవి, సిహెచ్ విజయలక్ష్మి, ఎం కనకరత్నం, కాళిమ్మ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి** : బంటుమిల్లిలో అంగన్‌వాడీలు ఎస్మాప్రతులను దగ్ధం చేశారు. ఈ ఈకార్యక్రమంలో శ్రామిక మహిళా కన్వీనర్ ధనశ్రీ, సిఐటియు మండల కోశాధికారి కొమ్మలపాటి రవి, సిఐటియు మండల కార్యదర్శి మాజేటి శివ శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, మండల రైతు సంఘం మండల కార్యదర్శి లంకదాసు అజయ్ ఘోష్ తదితరులు మద్దతు తెలిపారు. ఈకార్యక్రమంలో పలు మండలాలకు చెందిన అంగన్‌వాడీలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ** : అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ భోగిమంటలు వేసి అందులో ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలని జీవో కాపీలను దగ్ధం చేశారు. గుడివాడ సిడిపిఒ కార్యాలయం ముందు అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సమ్మె ఆదివారం 34వ రోజుకు చేరుకుంది. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్పిసి రెడ్డి, బివి శ్రీనివాసరావు, అంగన్వాడి వర్కర్స్ నాయకులు నగీన, శిరీష, నాగమణి, వాణి, గీత, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు ఆదివారం యుటిఎఫ్ నాయకులు తమ పూర్తి మద్దతును తెలియజేశారు. అంగన్వాడీలు చేపట్టిన జగనన్నకు చెబుదాం సంతకాల సేకరణ కార్యక్రమానికి సిఐటియు నాయకులు మద్దతుగా ఆదివారం సంతకాల సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ సి పి రెడ్డి, గుడివాడ పట్టణ కార్యదర్శితమ్మిశెట్టి లక్ష్మణరావు, బొంతు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్**: అంగన్వా డీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిఐటియూ మండల అధ్యక్షుడు బేత శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.మండల కేంద్రమైన బాపులపాడు హనుమాన్ జంక్షన్లో ఆదివారం సిఐటియూ ఆధ్వర్యంలో అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం 'జగనన్నకు చెబుదాం'.. పేరిట కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించి గ్రామంలో ప్రజల వద్ద సంతకాల సేకరణను చేపట్టారు. కృష్ణ మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు సంతకాల సేకరణలో మొదట సంతకం చేశారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ** : ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట నాలుగు మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా భోగి పండుగ కావడంతో భోగిమంటలు వేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నిర్మల జ్యోతి, ఏ నాగమణి ,గాదే సుశీల, కె పాములమ్మ, కాశీ హంస, కె విజయ రాణి, ఎం సుధారాణి తదితరులు పాల్గొని సమ్మె నిర్వహించారు. **పామర్రు** : పామర్రులో అంగన్‌వాడీల దీక్షా శిబిరాన్ని కె.ఉమారాణి ప్రారంభిం చారు. అనంతరం ఎస్మా ప్రతులను భోగిమంటల్లో వేసి దహనం చేశారు. రత్నశ్రీ, పద్మజ, ఉమా, చిన్నారి తదితరులు పాల్గొన్నారు. సిఐటియు నాయకులు ఓ. గంగాధర్, ఐ.రాజు మద్దతు తెలిపారు.



మచిలీపట్నంలో...



బంటుమిల్లిలో...



అవనిగడ్డలో...



కంకిపాడులో...



హనుమాన్‌జంక్షన్‌లో సంతకాలు చేస్తున్న దృశ్యం

జూద క్రీడలకు దూరంగా ఉండాలి : సిఐ



ప్రజాశక్తి-తోట్లవల్లూరు : యువత కోడి పందాలు, పేకాట, గుండాట వంటి అసాంఘిక కార్యక లాపాలకు దూరంగా ఉండి యువత సన్మార్గంలో నడవాలని పమిడి ముక్కల సర్కిల్ ఇన్స్పెక్టర్ కిషోర్ బాబు అన్నారు. జూధ క్రీడలు వద్దు, సాంప్రదాయ క్రీడలు ముద్దు అనే నినాదంతో గత నాలుగు రోజులుగా పమిడిముక్కల సర్కిల్ పరిధిలోని పమిడిముక్కల మరియు తోట్లవల్లూరు పోలీస్ స్టేషన్ లిమిట్స్‌లో జరుగుతున్న ఆటల పోటీలలో విజేతలకు ఆదివారం బహుమతుల ప్రదానోత్సవం చేశారు వాలీబాల్, ముగ్గుల పోటీలు, పరుగు పందాలు పోటీలు నిర్వహించగా గెలుపొందిన వారికి మెమెంటోలు, మరియు క్యాష్ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పమిడిముక్కల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం కిషోర్‌బాబు యువతను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు జోన్నల రామ్మోహన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి, ఎంపీపీ ఈడుపుగంటి రాజామణి, సర్పంచ్ పెనుమత్స రాధిక , కిలారం శ్రీనివాసరావు,వైసీపీ నాయకులు మత్తే విజయ నాగరాజు, తొట్లవల్లూరు ఎస్సై విశ్వనాధ్, పమిడిముక్కల ఎస్సై కిషోర్ కుమార్ పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు.

కొడాలి పిఎసిఎస్ అధ్యక్షునికి సతీవియోగం



ప్రజాశక్తి- ఘంటసాల : కొడాలి పిఎసిఎస్ అధ్యక్షులు పరుచూరి రామకృష్ణ ప్రసాద్ సతీమణి పరుచూరి హేమలత శనివారం అర్ధరాత్రి మృతి చెందారు. హేమలత పార్థివదేహాన్ని ఆదివారం గ్రామానికి చెందిన నాయకులతోపాటు పలువురు పిఎసిఎస్ చైర్ పర్సన్లు, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మతికి గల కారణాలను రామకృష్ణ ప్రసాద్ ను అడిగి తెలుసుకొని ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు.

పెన్షన్‌దారుల చేయూత

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం మండలం ఎస్ఎన్‌గొల్లపాలెం గ్రామంలో సామాజిక పెన్షన్లు పొందుతూ అనారోగ్య కారణంగా కొడాలి విమలమ్మ, కొమ్ము శ్రీనివాసరావు గత నెలలో మృతిచెందారు. స్థానిక శాసన సభ్యులు పేర్ని నాని, యువ నాయకులు పేర్ని కిట్టు బాబు ఆధ్వర్యంలో తోటి పెన్షన్ దారులు అందరూ వందరూపాయల చొప్పున వేసుకుని ఒక్కొక్క కుటుంబానికి రూ.30,300 చొప్పున మొత్తం రూ.60600 లను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మట్టా మోహన్ నాంచారయ్య, మార్కెట్ యార్డ్ డైరక్టర్ చోరగుడి.రామచంద్రరావు, సచివాలయం కన్వీనర్లు గణేశన వెంకటేశ్వర రావు,గణేశన రమేష్ బాబు, మట్టా సాదుసుందర్ సింగ్, బోలెం అర్జునరావు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-పమిడిముక్కల : సాంప్రదాయ విలువలకు సంక్రాంతి పండుగ పెద్ద పండుగని,ఈ పండుగ అందరికీ మంచి జరగాలని పమిడిముక్కల ఎస్సై కిషోర్ కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని అమ్మినాపురం గ్రామంలో సాంప్రదాయ ముగ్గులు పోటీలు జరిగాయి. మహిళలు ఉత్సాహంగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు మాజీ ఎంపీటీసీ సభ్యులు పోరంకి వెంకట శివ వరప్రసాద్ బహుమతులను అందజేశారు. అలాగే మండలంలోని లంకపల్లి, మేడూరు, వీరంకిలాకులలో కూడా ఉత్సాహంగా ముగ్గులు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. విశ్రాంత ఉపాధ్యాయులు రాజు, అమ్మినాపురం కోపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు కాటంరాజు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కొండాలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి ని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుండి సుమారు 10 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పాల పొంగళ్ళు సమర్పించి వారి వారి మొక్కుబడులను తీర్చుకున్నారు. విచ్చేసిన భక్తులకు ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకునేందుకు ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి చైర్మన్ శేషం వీర వెంకట కృష్ణమూర్తి, దేవస్థాన కార్య నిర్వాహణ అధికారి కానూరి సురేష్ బాబు ఏర్పాటు పరిశీలించినట్లు తెలిపారు.

కొనసాగుతున్న ఎడ్ల బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి-గుడివాడ : ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని), కొడాలి చిన్ని ఆధ్వర్యంలో స్థానిక లింగవరం రోడ్డులోని కె కన్వెన్షన్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ టూ వైయస్సార్ జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు ప్రదర్శన 4వ రోజుకు చేరుకున్నాయి. ఆదివారం సేద్య విభాగంలో జరుగుతున్న ప్రదర్శనను పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో పాల్గొన్న పశుపోషకులకు అనిల్ జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్య క్రమంలో ఎన్టీఆర్ టూ వైయస్సార్ ట్రస్టు సభ్యులు వల్లురుపల్లి సుధాకర్, పాలడుగు రాంప్రసాద్, వల్లభనేని బానుప్రకాష్, వైసిపి పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను, వైసిపి నాయకులు, పాల్గొన్నారు.

టిడిపి నిరసనలు

ప్రజాశక్తి ఉయ్యూరు : జగన్మోహన్‌రెడ్డి చీకటి పాలనకు స్వస్తి పలుకుతూ రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే చంద్రబాబు పాలన రావాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యలమం చిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్ అన్నారు. భోగి పండుగ పురస్కరిం చుకొని ఆదివారం ఆయన నివాసం వద్ద భోగి మంటలువేసి అందులో రాష్ట్ర ప్రభుత్వ చీకటి జీవో లను తగులబెట్టారు. 4 సంవత్సరాల 9 నెలలుగా ఆంధ్రప్రదేశ్లో చీకటి రోజులు నడుస్తున్నాయని, ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రా న్ని అన్నిరంగాల్లో భ్రష్టు పట్టించారని ఆరోపించారు. మాజీ సర్పంచ్ యల మంచిలి మరాంబ, పార్టీ నాయకుడు రామ్మోహన్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి కలక్టరేట్(కృష్ణా)** : భోగి వేడుకల ద్వారా ఈప్రభుత్వంపై యుద్ధం మొదలైందని, మరో రెండు నెలల్లో సంక్షేమ అభివృద్ధి రాజ్యం నారా చంద్రబాబునాయుడు పవన్ కళ్యాణ్ సారధ్యంలో తథ్యమని పలువురు టిడిపి నాయకులు స్పష్టం చేశారు. స్థానిక నియోజక వర్గ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ చీకటి జీవోలు భోగి మంటల్లో వేసి దగ్ధం చేశారు. పార్టీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్ ,మున్సిపల్ మాజీ చైర్మన్ మొట్టమర్రి బాబా ప్రసాద్ , పార్టీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఇలియాస్ పాషా, పిప్పళ్ళ కాంతారావు, నాయకులు లంకె నారాయణ ప్రసాద్, పరబ్రహ్మం లంకె శేషగిరి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్** : బాపులపాడు మండలం రంగన్నగూడెం గ్రామ టీడీపీ ఆధ్వర్యంలో కేడు తొలగాలి...ఏపీ వెలగాలి కార్యక్రమంలో భాగంగా రైతు, ప్రజావ్యతిరేక జీఒ ప్రతులను టీడీపీ నాయకుడు ఆళ్ళ గోపాలకృష్ణ, ఎన్నార్ఐ తుమ్మల రాంబాబులు భోగిమంటల్లో వేసి దగ్ధం చేశారు. రాష్ట్రాభివద్ధిని కాంక్షిస్తూ చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను గ్రామస్థాయిలో ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. మొవ్వా వేణుగోపాల్, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, ఎన్నారై తుమ్మల రాంబాబు, సర్పంచ్ కసుకుర్తి రంగామణి, మొవ్వా శ్రీనివాసరావు,పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి పెడన : వయోపరిమితి లేకుండా వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నామని ప్రముఖ పారిశ్రామికవేత్త, సంఘ సేవకులు గాజుల సాంబయ్య నాయుడు అన్నారు. గత మూడు రోజులుగా సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలు ఆదివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న సాంబయ్య నాయుడు మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా పెడనతో పాటు పలు ప్రాంతాల్లో ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. సహాయ ఫౌండేషన్ అధినేత ఉస్మాన్ బాషా, సభ్యులు మట్ట రాధాకృష్ణమూర్తి, ఆలుగురి అజయ్, కాగిత సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-గుడివాడ : సంక్రాంతి పండుగ పురస్కరిం చుకుని సామాజిక వేత్త డాక్టర్ మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) ఎన్టీఆర్ స్టేడియంలో పనిచేసే కార్మికులకు దుస్తులు మిఠాయిలు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌కె మాట్లాడుతూ మన తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమైన పండుగ సంక్రాంతి పండుగన్నారు. మనతోపాటు పొరుగువారు కూడా సంతోషంగా ఉండాలని ఆలోచనతో కార్మికులకు నూతన వస్త్రాలు అందజేసి సంక్రాంతి శు భాకాంక్షలు తెలియజేశా మన్నారు.

శోభన్ బాబు జయంతి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడ నడిబొడ్డున శోభన్ బాబు సర్కిల్‌లో శోభన్ బాబు విగ్రహానికి రాష్ట్ర శోభన్ సిండికేట్ అధ్యక్షులు డాక్టర్ కళ్లెపల్లి మధుసూదనరాజు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ధారా సత్యం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. మధుసూదన రాజు మాట్లాడుతూ శోభన్ బాబు మరణించి 16 సంవత్సరాల గడిచిన నేటికీ ఆయన తీపి గుర్తులు చెరిగి పోలేదన్నారు. అనంతరం ప్రధాన కార్యదర్శి డాక్టర్. ధారా.సత్యం మాటాడారు.


శోభన్ బాబు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

శీతాకాలంలో ఆహారం పట్ల జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : ప్రస్తుత శీతాకాలంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహారంపై దృష్టి సారించాలని ప్రధానంగా బాదంతో కూడిన పదార్థాలను ఎక్కువగా తీసుకోవడం వలన ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని గడపవచ్చుని న్యూట్రిషన్ నిపుణులు తెలియచేస్తున్నారు. నగరంలోనరి ఓ హోటల్‌లో చక్కటి ఆహారం అనే అంశంపై ఆదివారం అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా న్యూట్రిషన్ వైద్యులు జీవన శైలిలో ఎటువంటి ఆహారం తీసుకుంటే ఆరోగ్యకరంగా ఉంటాయో తెలిపారు. ప్రధానంగా ఉదయం సాయంత్రం సమయాలలో ఆహార పదార్థాలలో బాదంను చేర్చడం వలన శరీరానికి మంచి శక్తి, చక్కటి విటమిన్లు అందుతాయని తద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరంగా ఉంటారని అన్నారు. బాదంతో పాటు క్యారెట్‌ను కూడా ఆహార పదార్థాలతో తీసుకోవాలన్నారు. దీని వలన మంచి పోషక విలువలు కూడా అందుతాయని తెలిపారు.

సేవల విస్తరణకు ప్రణాళిక

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విపత్తు ప్రాంతాలలోని ప్రజలకు తగిన సహాయ, సహకారాలను అందించే దిశగా అమెజాన్ సంస్థ పనిచేస్తుందని సంస్థ ప్రతినిధి కె.ఈశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. రిసోర్స్ సెంటర్ ఫర్ పార్టిసిపేటరీ డెవలప్‌మెంట్ స్టడీస్, యే ఇండియా, స్వస్తి అసోసియేషన్ ఫర్ ది సోషల్ ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటబుల్ సంస్థ సంయుక్తంగా వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే అమెజాన్ ఇండియా ఆధ్వర్యంలో వెయ్యి షెల్టర్ కిట్‌లు, 2500 రేషన్ కిట్లు, టార్పాలిన్ షీట్లు, 3వేల బాంకెట్‌లను ఇటీవల మిచాంగ్ తుఫాను కారణంగా ఇబ్బందులు పడుతున్న వారికి అందించినట్లు తెలిపారు. రానున్న కాలంలో మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తరించనున్నట్లు తెలిపారు.

'టిడిపి హయాంలోనే బిసిలకు సముచిత స్థానం'

ప్రజాశక్తి - వత్సవాయి : టిడిపి ప్రభుత్వంలోనే బిసిలకు సముచిత స్థానం లభిస్తుందని టిడిపి జాతీయ కోశాధికారి రాజగోపాల్ తాతయ్య అన్నారు. వత్సవాయి గ్రామంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఫంక్షన్ హాల్‌లో మండల టిడిపి అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. తాతయ్య మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉండగా బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి బీసీ కార్పొరేషన్ ద్వారా అభివద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తే వైసిపి వారిపై బలహీన వర్గాల వారిని భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ రాధాకష్ణమూర్తి, వడ్లమూడి రాంబాబు, గడ్డం హుస్సేన్, ఆవుల రామారావు, కన్నెబోయిన రామలక్ష్మి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీరాం తాతయ్య

గర్భిణుల కోసం కామినేనిలో 'బేబీ బ్లిస్'

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : నగరంలోని కామినేని హాస్పిటల్‌లో కామినేని బేబీ బ్లిస్ పేరుతో గర్భిణులకు వైద్య సేవలందించేందుకు నూతన కేంద్రాన్ని ప్రారంభించినట్లు హాస్పిటల్ వైద్యులు డాక్టర్ శాంతి ప్రియ తెలిపారు. తాడిగడపలోని హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది అన్నారు.. ఈ ఆస్పత్రిలో తల్లి, శిశువుల ఆరోగ్య సంరక్షణకు అవసరమైన అన్నీ జాగ్రత్తలను నిపుణులతో కూడిని డాక్టర్ల బృందం తీసుకుంటుందన్నారు. కామినేని బేబీ బ్లిస్ సేవల కింద అనుభవజ్ఞులైన ప్రసూతి వైద్యులతో రెగ్యులర్ చెకప్‌లు, స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ అల్ట్రాసౌండ్ స్కాన్‌లు, తల్లి, నవజాత శిశువులకు రక్త పరీక్షలు, వ్యక్తిగతీకరించిన ప్రినేటల్ న్యూట్రిషన్ & వ్యాయామ ప్రణాళికలు, డెలివరీ వంటి సేవలను చేరిచినట్లు తెలిపారు. కాబోయే తల్లుల మానసిక మరియు శారీరక శ్రేయస్సుపై దష్టి సారిస్తూ వైద్యపరమైన నైపుణ్యానికి మించిన



వ్యక్తిగత సంరక్షణ." ప్రత్యేకత అన్నారు. కామినేని బేబీ బ్లిస్ ప్యాకేజీ ఆవిష్కరణ కార్యక్రమంలో డాక్టర్ జి మధురిక, డాక్టర్ చిట్టూరి వెంకట సాయి అఖిల్, డాక్టర్ ఏ. కృష్ణకాంత్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలో 30, 31వ వార్డులను కలుపుతు ఏర్పాటు చేస్తున్న రోడ్డు నిర్మాణ పనులను, స్విమ్మింగ్ పూల్ టెక్నికల్ సమస్య పునరుద్ధరణ పనులను ఆదివారం చైర్మన్ రాఘవేంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ ఎర్ర కాలువ మీద గత ముప్పై సంవత్సరాలుగా నివసిస్తున్న ప్రజలు సరైన రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నామని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తెలియజేయడంతో మున్సిపల్ ప్రత్యేక నిధుల సహాయంతో సుమారు రూ.35 లక్షల వ్యయంతో ఈ రోడ్డు నిర్మిస్తున్నామని తెలిపారు. కొన్ని టెక్నికల్ సమస్యల వల్ల స్విమ్మింగ్ పూల్ పూర్తి స్థాయిలో ప్రజలకు ఇన్ని రోజులు అందుబాటులోకి రాలేదని, ప్రత్యేక బృందంతో సమస్యలన్నీ తొలగిస్తున్నామని వచ్చే పది రోజుల్లో ప్రజలు అందరికీ ఉపయోగపడేలా చర్యలు


రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న చైర్మన్ రాఘవేంద్ర

తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర రావు, కౌన్సిలర్ పందుల రోశయ్య, వైసిపి నాయకులు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్, మీడియా సిబ్బందికి క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - నందిగామ : నందిగమ పట్టణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల , గ్రౌండ్ లో పోలీసులకు మీడియా మిత్రులకు మధ్య ఆసక్తికరమైన క్రికెట్ మ్యాచ్ జరిగింది ఈమ్యాచ్ లో జర్నలిస్ట్ మిత్రుల టీమ్ విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా ఎస్ఐ పండు దొర టీమ్ బ్యాటింగ్ చేసి నిర్నిత 10 ఓవర్లలో 67 పరుగులు చేసింది. ఓపినింగ్ జోడి పండు దొర మస్తాన్ మొదటివికెట్‌కి 46 పరుగుల భాగస్వామ్యం ఏర్పర్చగా మీడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌లు విఫలం అయ్యారు. స్కోర్ తక్కువగా వచ్చింది. పండు దొర 6, మూడు ఫోర్లతో (28 రన్స్) బ్యాటింగ్ అదరగొట్టారు. మీడియా మిత్రుల టీమ్ పోలీస్ వాళ్ళ టీమ్ ఇచ్చిన టార్గెట్ ని (8..3) ఓవర్లలో టార్గెట్ 6 వికెట్ల తెడా తో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో గౌరవ



అతిథిగా వచ్చి నందిగామ పట్టణ సిఐ హనీష్ కాసేపు బ్యాటింగ్ చేసి అద్భుతమైన షాట్లతో అలరించారు.



రోడ్డుపైనే చెత్త డంపింగ్

ప్రజాశక్తి - నందిగామ : పట్టణ శివారు రోడ్డుపై వేసే చెత్తతో ప్రయాణికులు దుర్వాసన భరించలేక పోతున్నారు. చెత్త కాల్చినప్పుడు వచ్చే పొగ రోడ్డును కమ్మేస్తుంది. ఇంటింటి నుండి సేకరించిన చెత్తను నందిగామ శివారు ప్రాంతం రోడ్లు పక్కనే పడవేయడంతో పట్టణ శివారు ప్రాంతం కంపు కొడుతోంది. ఆ మార్గాల్లో ముక్కు మూసుకోకుండా రాకపోకలు సాగించడం అసాధ్యంగా మారాయి. దోమలు, ఈగలు, బ్యాక్టీరియా వద్ధి చెంది స్థానికులు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

'అధికారం కోసం చంద్రబాబు ఆరాటం'

ప్రజాశక్తి - నందిగామ : అధికారం కోసం చంద్రబాబు ఆరాటం పడుతున్నారని, నందిగామ నియోజకవర్గ వైసిపి లీగల్ సెల్ కన్వీనర్ నందిగామ బార్ అసోసియేషన్ న్యాయవాది అద్దంకి మణి బాబు పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు రాష్ట్రప్రజలను నమ్మించడానికి అనేక ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారన్నారు. ఎన్టీరామారావు దగ్గర పదవి లాక్కొని 1997-98సంవత్సరంలో ప్రపంచబ్యాంక్ దగ్గర 30 వేల కోట్ల అప్పు తీసుకొచ్చి అప్పట్లో రాష్ట్ర ప్రజలను, రైతులు విద్యార్థులు, ఉద్యోగస్తులను ఎంత ఇబ్బంది పెట్టారో రాష్ట్ర ప్రజలకు తెలియనిది కాదన్నారు.

గూగుల్ సపోర్టుతో మహిళా ఇంజనీర్స్ ప్రోగ్రామ్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : గ్లోబల్ ఎడ్‌టెక్ కంపెనీ, ట్రాన్స్‌ఫర్మేషనల్ డీప్‌టెక్ ప్రోగ్రామ్‌లో భాగంగా నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలకు ప్రాధానత్య ఇవ్వాలనే ఉద్దేశంతో మహిళా ఇంజనీర్స్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నట్లు గూగుల్ వీపీ జిఎం శివ వెంకట రామన్ తెలిపారు. నగరంలోని ఓ హెూటల్‌లో శనివారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి సంవత్సరం చదువుతున్న మహిళా ఇంజనీరింగ్ విద్యార్థులకు 200 మందికి ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనిలో ఎంపికైన వారికి స్కాలర్‌షిప్ కూడా ఉంటుందని తెలిపారు. మహిళలకు విద్య, ఉపాధి అందించడమే ప్రధాన ఉద్దేశంగా ఈకార్యక్రమం జరుగుతుందని తెలిచేశారు. తొలి దశలో శిక్షణా కార్యక్రమం నిర్వహించిన అనంతరం తరువాత మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహించను న్నట్లు తెలిపారు.


మాట్లాడుతున్న నెట్టెం రఘురాం

చంద్రబాబుపై ఆరోపణలు సరికాదు

టిడిపి జిల్లా అధ్యక్షులు నెట్టెం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: జగన్‌మోహన్‌రెడ్డి సొంత పత్రిక వైసిపి కరపత్రంలో రాసిన వార్తపై ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు నెట్టెం శ్రీ రఘురాం విమర్శలకు దిగారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి దివాళా తీసే పరిస్థితిలో ఉందని, ఈ సమయంలో ప్రజల దృష్టి మరల్చడానికి జగన్ జేబు సంస్థ అయిన సిఐడిని అడ్డంపెట్టుకుని చంద్రబాబుపై లేనిపోని అభాండాలు వేస్తూ, నీలి వార్తలు రాస్తుందని, వైసిపికి ఇది తగదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గ రాష్ట్ర పార్టీ పరిశీలకుడు గింజుపల్లి రమేష్ రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి కొఠారి సత్యనారాయణ ప్రసాద్ ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధులు తాళ్లూరు వెంకటేశ్వర్లు, షేక్ అన్వర్, జగ్గయ్యపేట నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు, జగ్గయ్యపేట పట్టణ 10 వార్డ్ కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


పండ్లు పంపిణీ చేస్తున్న దాతలు

అనాథ పిల్లలకు స్వీట్లు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కేర్ అండ్ షేర్ నందు అనాథ పిల్లలకి స్వీట్స్ పండ్లు, ఆడ పిల్లలకు నూతన వస్త్రాలు, నిత్యా వసర సరుకులను 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం రవి, తిలక్, ధర్మరాజు, మరియు ప్రేమనాథ్ యోగ మిత్ర మండలి సభ్యులు నిర్వహించారు.

- తిరునాళ్లను తలపించేలా బరులు
- చేతులు మారిన లక్షలాది రూపాయలు
- పోలీసుల ప్రేక్షకపాత్ర
- ఏరులై పారిన మద్యం

యథేచ్ఛగా కోడిపందేలు





అంపాపురంలో జూద క్రీడలకు ఏరాపటు చేసిన స్వాగత దృశ్యం, కోడిపందేలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: కోళ్ల కత్తులు దూస్తుంటే..పందెం రాయుళ్లు డబ్బు కట్టలు తెంచారు. గిరిగీసి బరులను ఏర్పాటు చేసిన నిర్వాహకులు, ప్రైవేటు సైన్యం పహారాలతో యథేచ్ఛగా పేకాట, కోతముక్క, గుండా టలను నిర్వహించారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో రెచ్చిపోయిన స్థానిక నేతలు ఎక్కడికక్కడ, పోటాపోటీగా పక్కా ఏర్పాట్ల మధ్య, సకల మర్యాదలతో మూడు రోజులపాటు జూదాన్ని బహిరంగంగానే నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ప్రేక్షక పాత్రకే పోలీసులు పరిమితం కావడంతో, అడ్డు అదుపు లేకుండా మద్యం, మాంసం ఏరులై పారింది. పగలు,రాత్రి తేడా లేకుండా సాంప్రదాయ సంక్రాంతి ముసుగులో జరిగిన జూదంలో చిన్న, పెద్ద, ఆడ, మగ తేడా లేకుండా పందేలు కాశారు. ప్రతి ఏటా ఇదేవిధంగా జరుగుతున్నా ఈ ఏడాది మాత్రం పందేలకు అడ్డు లేకుండా పోయింది. రాష్ట్రవ్యాప్తంగానే కాక ఇతర రాష్ట్రాల్లో కూడా పేరెన్నిక గన్న అంపాపురం కోడిపందేల బరి మరోసారి తనసత్తా చాటింది. పోలీసుల పహారా మూలంగా మధ్యాహ్నం - మొదలైన కోడిపందేలు, క్యాసినో నిమిషాల వ్యవధిలోనే పుంజుకుని ప్రధానబరిలో వరుసగా 5లక్షల పైన కోడిపందేలు నిర్వహిస్తుండగా ప్రక్కనే ఏర్పాటు చేసిన 8 చిన్నబరుల్లో 4 లక్షల నుండి 1లక్ష వరకూ కోడిపందేలు నిర్వహిస్తున్నారు. మూడు శిబిరాల్లో ఏర్పాటు చేసిన క్యాసినోలో నగదు లెక్కపెట్టేందుకు మిషన్లను, సీసీ కెమెరాల పర్యవేక్షణతో పాటు వాకీటాకీలతో కూడిన బౌన్సర్లతో అనుమతిలేకుండా అన్యులెవరినీ అనుమతించ కుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. సంక్రాంతి పండుగ మూడురోజుల్లో పగలురాత్రి తేడాలేకుండా నిర్వహించే కోడిపందేలు, క్యాసినోల రూపంలో కోట్లాది రూపాయలు చేతులు మారనున్నాయి. బహిరంగంగా కోడి పందేలు జరుగుతున్నా పోలీసు యంత్రాంగంపై రాజకీయ వత్తిడి రావడంతో వారు వారు కూడా ముఖం చాటేశి ప్రేక్షక పాత్ర పోషించారు. దీంతో పందెంరాయుళ్లకు అవసరమైన మద్యం, తినుబండంబాల రాలను అందజేశారు. బరుల వద్ద మద్యం ఏరులై పారింది. పందే ఈ కోడి పందేలలో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, వ్యాపార, పారిశ్రామికవేత్తలు, ఎస్‌ఆర్వాలతో అమ పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన వారు పాల్గొని తమకు బేఖా స్థాయికి తగిన విధంగా పందేలు కట్టారు.

తెలంగాణా నుండి పోటెత్తిన ప్రజలు : తెలంగాణా రాష్ట్రం నుండి పందేలకోసం 20కిపైగా పొటేళ్లను తీసుకవచ్చారు. పందేలను చూసేందుకు వచ్చిన వారి కార్లతో అంపావురం వద్ద జాతీయ రహదారి ప్రక్కనేగల సర్వీస్ రహదారి నిండిపోవడంతో ట్రాఫికికి తీవ్ర అంతరాయం ఏర్పడించి కొంతమంది తమ కార్లను రహదారి ప్రక్కనగల ఖాళీస్థలాల్లో నిలిచేలను తిలకించేందుకు వెళ్లిపోయారు.

గోవా వారి పర్యవేక్షణలో భారీగా క్యాసినో : గోవాకు చెందిన సంస్థ పర్యవేక్షణలో కట్టుదిట్టాల మధ్య క్యాసినో మూడు శిబిరాలను ఏర్పాటు చేశారు. నగదు లెక్కించి కాయిన్స్ ఇచ్చేందుకు ప్రత్యేకంగా మిషన్లను వినయోగిస్తున్నారంటే ఎంత భారీగీ జరుగుతుందో అర్థమవుతోంది. మూడు శిబిరాలకు వేర్వేరుగా పాస్లు పాల్గొనేవారికి ప్రత్యేకంగా చేతి కంకణాలు ఏర్పాటు చేశారంటే భద్రత ఎంతకట్టుదిట్టంగా చేశారో తెలుస్తోంది.

పొటేళ్ల పందేలకు బరిసిద్ధం : ప్రత్యేక ఆకర్షణ కోసం పొట్టేళ్ల పందేలను నిర్వహించేందుకు ప్రత్యేకంగా బరిని ఏర్పాటు చేశారు. తెలంగాణా నుండి 20కి పైగా పొట్టేళ్ల పందేల్లో పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నాయి. ఆదివారం రాత్రి నుండి పొట్టేళ్ల పందేలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. సంక్రాంతి పండుగకు రాష్ట్రానికే తలమానికమైన పెద్ద బరుల్లోనే పేరుగాంచిన అంపాపురం ఈసారి కూడా అన్ని రకాలుగా తన ప్రత్యేకతను మరోసారి చాటిచెప్పేందుకు సిద్ధమైంది.

బాపులపాడు మండలంలో అంపాపురంతో కె.సీతారాంపురం, కొత్తపల్లిలో బరులు సిద్ధం చేసి కోడిపందేలు నిర్వహించారు. కొత్తపల్లి పామాయిల్ తోటలో, కె.సీతారాంపురంలో జాతీయ రహదారి ప్రక్కన ఏర్పాటు చేసిన బరుల్లో రాత్రి పూట కూడా కోతముక్క కోడిపందేలు నిర్వహిం చేందుకు ఫ్లడ్ లైట్లను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. వేలేరు, సింగన్నగూడెం, ఓగిరాల, తిప్పనగుంట, ఆరుగొలను తదితర గ్రామాల్లో చిన్నపాటి కోడిపందేల బరులను ఏర్పాటు చేశారు.

ప్రజాశక్తి-పెడన : వడ్డించేవాడు మనవాడైతే ఎక్కడ కూర్చున్న పర్వాలేదు అన్న చందంగా అధికార పార్టీకి చెందిన నాయకులు పని తీరు తయారయింది. ఇందుకు ఉదాహరణ సాక్షాత్తు పెడన పట్టణంలోని పల్లోటి పబ్లిక్ స్కూల్ పబ్లిక్ స్కూల్ కు 100 మీటర్ల దూరంలో నిర్వహించిన ఈ శిబిరమే నిదర్శనం. పెడన మున్సిపాలిటీ తోపాటు పంచాయతీలో పాటు పలు ప్రాంతాల్లో ఆదివారం రాజకీయ నాయకుల అండదండలతో కౌన్సిలర్లు, సర్పంచులు బరితెగిం చేశారు. సాక్షాత్తు జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న ఈ పెడనలోనే ద్వితీయ శ్రేణి నాయకులు బరితెగించేశారు. ఫలితంగా లక్షలాది రూపాయలు చేతులు మారాయి. పెడన పోలీస్ స్టేషన్ కు కనీసం 500 మీటర్ల నిర్వహించిన ఈ శిబిరానికి ఎవరు అడ్డు అదుపు చెప్పడం నిర్వచనం పోలీస్ శాఖ పనిచెరుకు అర్థం పడుతుంది. పట్టణ పరిధిలోని గుడివాడ రోడ్ లో ఉన్న పల్లోటి పాఠశాలలకు 50 మీటర్ల దూరంలో జూదశిబిరం నిర్వహించారు. మరో రెండు రోజులపాటు ఇదే ప్రాంతంలో కోడిపందాలు, జూదం, గుండాట, మద్యం అమ్మకాలు లాంటివి కొనసాగుతూనే ఉంటాయని నిర్వాహకులు అంటున్నారు. ఇదిలా ఉండగా పెడన పోలీస్ స్టేషన్కు భారీ మొత్తంలో ముడుపులు అందాయని ఆరోపణలు వస్తున్నాయి.

ప్రజాశక్తి-చల్లపల్లి : మండల పరిధిలోని వెలివోలులో అవనిగడ్డ విజయవాడ కరకట్ట ప్రక్కన కోడిపందాలు జోరుగా సాగాయి. జూదక్రీడాలకు అవకాశం లేదన్న పోలీస్ అధికారుల జాడలేదు. పదివేల రూపాయల నుండి లక్ష వరకు పందేలు సాగుతున్నాయి. కోడిపందాలలో యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పందాలతో పాటు పేకాట శిబిరాలు నిర్వహించారు.



అంపాపురంలో జూదక్రీడల్లో సకల సౌకర్యాలు





పెడన మండలంలో కోడిపందేలు

పోలీస్ హెచ్చరికలు బేఖాతరు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

సంక్రాంతి పేరుతో కోడిపందెల బరులు, జూద క్రీడల శిబిరాలు నిర్వహిస్తే సహించమని పోలీసు హెచ్చరికలు మాటలకే పరిమితమయ్యాయి. నిర్వహకులు ఎక్కడా పరిగణలోకి తీసుకోలేదు. ప్రతి మండలంలోనూ రెండు నుంచి మూడు పందెం బరులు, జూద శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆదివారం కృష్ణా జిల్లా వ్యాప్తంగా విచ్చలవిడిగా కోడిపందెలు, జూద క్రీడలు బహిరంగంగానే సాగాయి. పందెం బరులు, జూద శిబిరాలు వద్ద పోలీసుల బెడద ఉండదని నిర్వహకులు ప్రచారం చేశారు. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 20 ప్రధాన బరులు, జూద శిబిరాలు, మరో 50 చిన్న బరులు, శిబిరాల్లో ఒక్కరోజులోనే రూ.80 కోట్లకుపైగా చేతులు మారాయి. కోడిపందెల బరులకు, జూద క్రీడల శిబిరాలకు పోలీసుల అనుమతి ఉందని, సోమ, మంగళవారాల్లోనూ కొనసాగుతాయని నిర్వహకులు మైకుల్లో ఎనౌన్స్ చేశారు.'

మచిలీపట్నం నుంచి మంగినపూడి బీచ్‌కు వెళ్ళే రోడ్డుపక్కనే మేకవానిపాలెంలో సంక్రాంతి సంబరాల పేరుతో అతిపెద్ద కోడిపందెం బరి, పేకాట, గుండాటలకు జూద శిబిరాలను ఏర్పాటు చేశారు. వాలిశెట్టి ఫోర్స్ పేరుతో పసుపు చొక్కాలు వేసుకున్న వ్యక్తల పర్యవేక్షణలో ఈ తంతంగం సాగుతోంది. మచిలీపట్నం, పెడన పరిసర ప్రాంతాల నుంచి పందెం రాయుళ్ళు, పేకాట వ్యసన పరులు వేలాదిగా తరలి వచ్చారు. ప్రాంగణం అంతా కారులు, బైక్‌ల పార్కింగ్‌తో నిండిపోయింది. పందెలకు బరిలో దిగాల్సిన కోళ్ళ వివరాలను ఎప్పటికప్పడు నిర్వహకులు మైక్‌లో ఎనౌన్స్ చేశారు. ఆదివారం ఒక్కరోజే ఉదయం నుంచి సాయంత్రం వరకు బరిలో 146 కోడిపందెలు వేశారు. 292 కోడి పుంజు లకు కత్తులు కట్టి బరిలో వదిలారు. రూ. మూడు కోట్లుపైగా చేతులు మారాయి. కోతముక్క కోసు, గుండాటల్లో మరో రూ. కోటికిపైగా చేతులు మారాయి.

జిల్లాలో ఇలా : బాపులపాడు మండలం అంపాపురం, పెనమలూరు మండలం గుడ్లవల్లేరు మండలం మార్కెట్ యార్డు పక్కన, వేమవరం కొండాలమ్మ గుడి సమీపంలో, గుడివాడ పట్టణంలో మార్కెట్ యార్డు సమీపంలో, ఎండ్ల పందెలు ప్రాంగణం సమీపంలో, బంటుమిల్లి, గూడూరు, పెడన మండల కేంద్రాల్లో, ఘంటసాల మండలం లంకపల్లి, అవనిగడ్డ మండలం పులిగడ్డ, కోడూరు మండలం విశ్వనాథపల్లి, కోడూరు, ఉల్లిపాలెం గ్రామాల్లో, నాగాయలంక మండలం సొర్లగొంది, వక్కపట్లవారిపాలెం, ఎదురుమొండి దీవులు, మోపిదేవి మండలం పెదప్రోలు -కొత్తపాలెం రోడ్డులో, చల్లపల్లి మండలం వెలువోలు, కంకిపాడు మండలంలోని కంకిపాడు, ఈడుపుగల్లు, ఉప్పులూరు, గొడవర్రు, పెనమలూరు మండలం యనమలకుదురులో, పమిడిముక్కల మండలం ముళ్ళపూడి, కపిలేశ్వరపురం, తోట్లవల్లూరు మండలం భద్రిరాజుపాలెం, తోట్లవల్లూరు, గరికపర్రు, మొవ్వ మండలం కూచిపూడిలో రెండు శిబిరాలు ఏర్పాటు చేశారు. పెదపారుపూడిలో యలమర్రు, ఉంగుటూరు మండలం పెదఅవుటపల్లి, కొయ్యగూరపాడు, నందమూరు, మానికొండ, తరిగొప్పల తదితర గ్రామాల్లో కోడిపందెలు, జూద క్రీడలు విచ్చలవిడిగా సాగాయి.



చల్లపల్లిలో కోడిపందేలు నిర్వహిస్తున్న దృశ్యం



గన్నవరం మండలంలో ఏర్పాటు చేసిన టెంట్లు

చేతుల మారిన కోట్ల రూపాయలు



గన్నవరం మండలంలో జూదక్రీడల దృశ్యాలు





ప్రజాశక్తి-గన్నవరం : కోడి పందేలు, జూద క్రీడల నిర్వహణకు గన్నవరం నియోజకవర్గం ప్రధాన వేదికంగా మారింది. ఇక్కడ 30 పెద్ద, 50కి పైగా చిన్న బరుల్లో కోడిపందాలు వేస్తున్నారు. మరోపక్క పేకాట జూదం కూడా కొనసాగుతోంది. మూడు రోజులపాటు ఈ జూదం సాగుతుంది. అంపాపురం, పెదవుటపల్లి, ఇందుపల్లి, మానికొండ, తెంపల్లి, చిన్న ఆవుటపల్లి, పెద్ద అవుటపల్లి, గోపవరపు గూడెం, గొల్లనపల్లి, గన్నవరం, కేసరపల్లి మరికొన్ని గ్రామాల్లో పంట పొలాలను చదును చేసి, అవసరమైన సామగ్రిని దిగుమతి చేసుకుని పందాలు వేస్తున్నారు. గత ఎనిమిదేళ్లుగా ఈ గ్రామాల్లో సంక్రాంతి మూడు రోజులూ శిబిరాలు నిర్వహిం చడం ఆనవాయితీగా వస్తోంది. పోలీసులు మొదటి రోజున హడావుడి చేయడం ఆ తర్వాత తప్పుకోవడం సాధా రణమైంది. గన్నవరం ఎమ్మెల్యే అందుబాటులో లేకపోయినా ఆయన పేరు చెప్పి యథేచ్ఛగా పందాలు వేస్తున్నారు. నిర్వాహకుల్లో కొందరు ఎమ్మెల్యే ముఖ్య అనుచరులను కలిసి తమ పనులను సాగిస్తున్నారని వాదన ఉంది. ఈ మూడు రోజుల్లో కోట్ల రూపాయలు చేతులు మారతాయని చెబుతున్నారు. అంపాపురంలో భారీ ఎత్తున జూదం కొనసాగుతోంది.

కేసినో కూడా సాగినట్లు తెలుస్తోంది. కేసినో ఆటకు రింగ్ లీడర్ గా పేరుందిన ప్రముఖ జూదగాడు(కోటి) ఆధ్వర్యంలో ఈసారి జూద క్రీడలు మూడు రోజులు జరిగేలా ఏర్పాటులు చేశారు. బయటకు కనిపించేది ఒకటి లోపలికి వెళితే కళ్ళు తిరిగి పోయే ఏర్పాట్లు చేశారని కొంతమంది చెబుతున్నారు. ఒక్క అంపాపురంలోనే 50 నుంచి 100 కోట్లు చేతులు మారతాయని అంటున్నారు





కుదిరిన సయోధ్య

- అధిష్టానం ఆదేశాల మేరకు నడవాలని విష్ణు ఆలోచన
- రానున్న ఎన్నికల్లో వెల్లంపల్లికి సహకరించాలని నిర్ణయం




ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ ఎమ్మెల్యేలు వెల్లంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు మధ్య సయోధ్య కుదిరినట్లు తెలుస్తుంది. రాబోయే ఎన్నికల దృష్ట్యా అభ్యర్థుల మార్పులు- చేర్పుల్లో భాగంగా సెంట్రల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్జిగా, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావును వైసిపి అధిష్టానం నియమించడం, దీనిపై స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణు అలక బూనటమే గాక, అతని అనుచరులు అధిష్టానం వైఖరిని నిరశిస్తూ నియోజకవర్గంలో నిరసనలు తెలిపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే వైసిపి నేతలు అయోధ్యరామిరెడ్డి, మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే మల్లాది విష్ణుతో మాట్లాడినప్పటికీ...తన అసంతృప్తిని వ్యక్తం చేస్తూ వస్తున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్జీ అయిన వెల్లంపల్లి మరొక వైపున సెంట్రల్ నియోజకవర్గం కార్పొరేటర్లు, ఆపార్టీ ద్వితీయ శ్రేణి నాయకులను సంప్రదిస్తూ, తనదైన శైలిలో కార్యక్రమాలను నిర్వహించుకుంటూ వెళ్తున్నారు. అంతేగాక ఇన్‌చార్జ్జిగా నియమింపబడిన వెంటనే ఎమ్మెల్సీ రుహుల్లాను కలుపుకొని వెల్లంపల్లి ఎమ్మెల్యే మల్లాదిని సప్రందించడం, అందరం కలిసి పార్టీ అభివృద్ధికి, నియోజకవర్గంలో వైసిపి విజయానికి కలిసి కట్టుగా పని చేద్దామని, తనకు సహకరించాలని ఆ సమయములో మల్లాదిని వెల్లంపల్లి కోరినప్పటికీ, అధిష్టానం నిర్ణయాన్ని తప్పుపడుతూ, అలకబూనిన మల్లాది తన అనుచర గణంతోపాటు పలువురు కార్పొరేటర్లతో నియోజకవర్గంలో అడపాదడపా కార్యక్రమాలను నిర్వహించుకుంటూ వెళ్తున్నారు. దీంతో వెల్లంపల్లి , మల్లాది వ్యవహారాన్ని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఆపార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లడం తెలిసిందే. ఈ పరిస్థితిని అంచనా వేసిన వైసిపి అధిష్టానం రానున్న ఎన్నికల్లో పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే మల్లాదికి ఎమ్మెల్సీ ఇవ్వడం జరుగుతుందని చెప్పడం జరిగింది. మరొక వైపున టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తన కార్యకలాపాలను నియోజకవర్గంలో నిర్వహిస్తూ, నియోజకవర్గం అధికార వైసిపి ఇన్‌చార్జ్జిపై తీవ్రమైన విమర్శలు చేస్తూ వస్తున్నారు. 'అక్కడ చెల్లని కాసు ఇక్కడ చెల్లుతాడా' అంటే పశ్చిమ నియోజకవర్గంలో గెలవలేని వెల్లంపల్లి.... సెంట్రల్ నియోజకవర్గంలో గెలుస్తాడా అంటూ ఒకింత వ్యంగ్యంగా...విమర్శ చేయడం, దానిపై వెల్లంపల్లి కూడా బొండా ఉమామహేశ్వరరావుపై ఘాటుగా మాట్లాడటం జరిగింది. ఇప్పటి నుంచే సెంట్రల్‌లో ఆట మొదలయిందని, మల్లాది విష్ణు, తాను కలిసికట్టుగా పని చేసి, బొండా ఉమకు తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించడం తెలిసిందే. ఈ క్రమంలో వైసిపి అధిష్టానం ఎమ్మెల్సీ పదవి ఇస్తామని ఇచ్చిన హామీ మేరకు మల్లాది ఒకింత మెత్తపడినట్లు తెలిసింది. ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటూ, ప్రతిపక్ష టిడిపిపై తీవ్రమైన విమర్శలు మల్లాది చేస్తున్నారు. నియోజకవర్గం ఇన్‌చార్జ్జి వెల్లంపల్లికి రానున్న ఎన్నికల్లో సహకరించాలనే సంకేతాలు మల్లాది వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. సంక్రాంతి భోగి రోజున ఈ విషయం మీడియాలో కూడా పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఒకటి, రెండు రోజుల్లో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయాలనే ఆలోచనతో కూడా మల్లాది ఉన్నట్లు తెలిసింది. మరొక వైపున వెల్లంపల్లి శ్రీనివాస్...త్వరలోనే సెంట్రల్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంబించి, కార్పొరేటర్లను, ద్వితీయ శ్రేణి నాయకులను కలుపుకొని ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచన చేస్తున్నారు. ఏదేమైనా రానున్న ఎన్నికల్లో అధికార వైసిపి విజయం కోసం వెల్లంపల్లికి సహకరించాలనే ఆలోచనలో మల్లాది ఉన్నట్లు తెలిసింది.

పండుగ పూట విషాదం

- ఇద్దరు యువకులు దుర్మరణం
- కురుమద్దాలి సర్వీసు రోడ్డులో ప్రమాదం

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి: విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి-65 కురుమద్దాలి సర్వీస రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. మంచులో ముందున్న ట్రాక్టర్‌ను గమనించక స్కూటీతో ఢీ కొనడంతో యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కురుమద్దాలికి చెందిన పి.చినగోవిందు (22), తోలేటి హరి(22)లు ఆదివారం ఉదయం ఆరు గంటల సమయంలో జాతీయ రహదారి వద్ద ఉన్న పెట్రోలు బంకులో తమ స్కూటీకి పెట్రోలు నింపుకున్నారు. తర్వాత సర్వీసు రోడ్డులో తిరిగి గ్రామానికి వెళుతున్నారు. ముందు వెళుతున్న ట్రాక్టర్‌కు బ్రేక్ వేసి ఒక్కసారిగా రోడ్డుపై నిలిపివేశారు. తీవ్రమైన మంచులో ముందున్న వాహనాన్ని సరిగా గమనించకపోవడంతో ముందన్న ట్రాక్టర్‌ను ఢీ కొన్నారు. ఇద్దరు యువకులు అక్కడికక్కడే చనిపోయారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను పామర్రు పోలీసుల అదుపులోకి తీసుకున్నారు.

ముగిసిన సువార్త సభలు


ప్రజాశక్తి-విజయవాడ: సత్యనారాయణపురం ముత్యాలంపాడు అంబేద్కర్ కాలనీలోని రెవ పి.ప్రకాశం బేతెస్థ ప్రార్థన మందిరం 44వ వార్షిక సువార్త సభలు ఆదివారం రాత్రి ముగిశాయి. గత నాలుగు రోజులుగా జరుగుతున్న ఈ సభల్లో ప్రశాంత్ జోష్, జయరాజ్, రవీంద్ర బాబు వర్తమానం అందించారు. ముగింపు కార్యక్రమానికి సెంట్రల్ ఎంఎల్‌ఎ మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనను సంఘ కాపరి రెవ పి.విద్యాసాగర్, పెద్దలు శాలువాతో సత్కరించారు. సంఘస్తులు, యవనస్తులు, పిల్లలు, పెద్దలు సంఖ్యలో పాల్గొని సువార్త సభలను విజయవంతం చేశారు.



ప్రజాశక్తి మాజీ ఉద్యోగి బ్రహ్మానందరావు మృతి

ప్రజాశక్తి-వన్‌టౌన్ (విజయవాడ)

ప్రజాశక్తి మాజీ ఉద్యోగి పెట్ల బ్రహ్మానంద రావు (79) శనివారం రాత్రి మృతి చెందారు. విజయవాడ భవానీపురం హెచ్‌బి కాలనీలో నివాసముంటున్న ఆయన మూడు రోజుల క్రితం అస్వస్థతకు గురికావడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. ఆయనకు భార్య చితేశ్వరి, ఇద్దరు కుమార్తెలు పద్మజ, లీలావతి ఉన్నారు. ఆయన స్వగ్రామం కృష్ణాజిల్లా చల్లపల్లి. అక్కడ ఫొటోగ్రఫీ వృత్తి చేసుకుంటూ సిపిఎం సభ్యత్వం తీసుకున్నారు. అనంతరం ప్రజాశక్తి చల్లపల్లి విలేకరిగా కొద్దికాలం పనిచేశారు. 2005లో ప్రజాశక్తి విజయవాడ ఎడిషన్‌లో బాధ్యతలు తీసుకున్నారు. ఎడిషన్ పరిధిలో కలెక్షన్ స్వాడ్‌గానూ, విజయవాడ సిటీ డివిజన్ కలెక్షన్, రికవరీ ఎగ్జిక్యూటివ్‌గానూ పనిచేశారు. 2018లో ప్రజాశక్తి నుండి రిటైరయ్యారు. సుమారు 13 ఏళ్లకుపైగా ప్రజాశక్తిలో సేవలందిన ఆయన ఆ తర్వాత రైతువాణిలో పనిచేశారు. బ్రహ్మానందరావు అంత్యక్రియలు ఆదివారం మధ్యాహ్నం గుణదల హిందూ శ్మశానవాటికలో జరిగాయి.



ప్రజాశక్తి సిబ్బంది, కౌలు రైతు సంఘం నేతల నివాళి

బ్రహ్మానందరావు భౌతికకాయాన్ని ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి సానుభూతి తెలిపారు. అలాగే ప్రజాశక్తి ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల సమన్వయ కమిటీ కన్వీనర్ ఎం.బి.నాథన్, కమిటీ సభ్యులు సిహెచ్.కృష్ణప్రసాద్, డి.యోహాన్, ప్రజాశక్తి సిబ్బంది ఓ.రమేష్, ఎస్.రమణరావు, విలేకరి విహెచ్.రాజు తదితరులు కూడా ఆయన భౌతికకాయన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. బ్రహ్మానందరావు మృతి పట్ల ప్రజాశక్తి చీఫ్ జనరల్ మేనేజర్ వై.అచ్యుతరావు, జనరల్ మేనేజర్ జి.శివరామకృష్ణ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ప్రజాశక్తికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.



ధనుర్మాస పూజలు

విజయవాడ అర్బన్: సీతారాంపురంలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస పూజా మహోత్సవ కార్యక్రమం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ పూజా మహోత్సవ కార్యక్రమంలో వి.రామకృష్ణారావు దంపతులు, ఎన్.వి. రమణ దంపతులు, చందవరపు శ్రీనివాసరావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. అలాగే ప్రతి ఏటా సంక్రాంతి పండుగ సందర్భంగా ఆలయంలో పూజా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఆదివారం ఉదయం పూజ అనంతరం ఆలయానికి వచ్చిన వారికి తీర్థ ప్రసాదాలను అందచేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

నెలాఖరుకు మూడో విడత భూముల రీ సర్వే పూర్తి

136 గ్రామాల్లో రీసర్వే నిర్వహించాలి. 131 గ్రామాల భూమి వివరాలు తహశీల్దార్ లాగిన్ అయ్యాయి. 91 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి 13 నోటిఫికేషన్ ఇచ్చాం. వాటిలో 90 గ్రామాలకు ఫైనల్ ఆర్‌వోఆర్ పూర్తయింది. జనవరి నెలాఖరుకు మూడో దశ సర్వే పూర్తవుతుంది.

ప్రశ్న: ఎంత విస్తీర్ణంలోని భూముల రీ సర్వే పూర్తయింది ?

502 రెవెన్యూ గ్రామాల్లో 8,83,440 ఎకరాలు 3,575 చదరపు కిలోమీటర్లు 159 మీటర్లు మేర రీ సర్వే నిర్వహించాలి. 246 గ్రామాల్లోని 2,34,426 ఎకరాలు 948 చదరపు కిలోమీటర్లు 692 మీటర్లు విస్తీర్ణంలో భూముల రీ సర్వే పూర్తయింది.

ప్రశ్న: భూముల్లో హెచ్చుతగ్గులపై ఫిర్యాదులు పరిష్కరిస్తున్నారా?

భూముల్లో హెచ్చుతగ్గులు, సరిహద్దు వివాదాల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మండల స్థాయిలో డిప్యూటీ తహశీల్దార్, మండల సర్వేయర్‌తో మొబైల్ టీం ఏర్పాటు చేసింది. ఎప్పటికప్పుడు రీ సర్వేపై వస్తున్న ఫిర్యాదులను ఈ టీం పరిష్కరిస్తోంది.

ప్రశ్న: సర్వే పూర్తయిన గ్రామాల్లో సరిహద్దు రాళ్లు పాతారా?

మొదటి దశలో రీ సర్వే పూర్తయిన 102 గ్రామాల్లో 1,30,940 రాళ్లు, రెండో దశ సర్వే చేసిన 53 గ్రామాల్లో 71,100 సరిహద్దు రాళ్లు పాతడం పూర్తయింది. మూడో దశ రీ సర్వే పూర్తయిన 91 గ్రామాల్లో 68 గ్రామాలకు 61,919 హద్దు రాళ్లు కావాలి. 61,336 సరఫరా అయ్యాయి. 18 గ్రామాల్లో 16,348 సరిహద్దు రాళ్లు పాతారు.

ప్రశ్న: సర్వే పూర్తయిన గ్రామాల్లో ఎల్‌పిఎంలు ఎన్ని కేటాయించారు?

రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రీ సర్వే నంబర్ల స్థానంలో భూయజమానికి ల్యాండ్ పార్శిల్ మ్యాప్ (ఎల్‌పిఎం)లు ఇవ్వడం జరుగుతుంది. మొదటి దశలో 62,369 మందికి, రెండో దశలో 48,935 మంది భూములకు ఎల్‌పిఎంలు ఇవ్వడం జరిగింది. ఆయా గ్రామాల్లో ఎల్‌పిఎంల ఆధారంగానే భూముల రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయి. మూడో దశ రీ సర్వే 136 గ్రామాల్లో రీ సర్వే పూర్తయితే 78, 473 ఎల్‌పిఎంలు ఇవ్వాల్సి ఉంటుంది.

సందడిగా భోగి వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ

సంక్రాంతి పండుగ పర్వదినాలను పురస్కరించుకుని తొలి రోజు ఆదివారం తెల్లవారుజామున భోగి వేడుకలు వాడవాడలా నిర్వహించారు. భోగి మంటలు వేసి పాత వస్తువులన్నీ మంటల్లో వేసి భోగి పండుగను జరుపుకున్నారు. అవనిగడ్డలో పలు ప్రాంతాలలో భోగి మంటలను వేసి పండుగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు భోగి పళ్ళు పోసి దీవెనలు అందజేశారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ ఆధ్వర్యంలో గాంధీ క్షేత్రంలో భోగిమంటలు వేసి ఇటీవల ప్రభుత్వం భూములకు సంబంధించి విడుదల చేసిన జీవో నెంబర్ 572 ప్రజలను మంటల్లో వేసి దగ్గం చేశారు.

ప్రజాశక్తి-ఉయ్యూరు: ఉయ్యూరు, పరిసర ప్రాంతాల్లో ఆదివారం సంక్రాంతి సంబరాలు సందడిగా నిర్వహించారు. మూడు రోజుల పండుగలో మొదటి రోజైన భోగి పురస్కరించుకుని వాడవాడ లా బోగిమంటలు వేసి చిన్నాపెద్దా తేడాలేకుండా సంతోషంగా గడిపారు. ఏక ఆండ్స్‌ఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రా ంతి సంబరాల్లో భాగంగా భోగి మంటలువేసి పాటలుపాడుతూ ఉల్లాసంగా గడిపారు. ముగ్గుల పోటీలు, గంగెరెద్దుల ఆటలతో సందడిగా గడిపారు. పిల్లలకు భోగిపళ్లు పోసి ఆశీర్వవచనాలు పలికారు. అధ్యక్షుడు సత్తార్, కార్యదర్శి పూర్ణచంద్రరావు, కిషోర్, కోటేశ్వరరావు, బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చల్లపల్లి: సమాజానికి దూరంగా ఉంటూ దయనీయ స్థితిలో జీవనం సాగిస్తున్న నిరుపేదల సమక్షంలో సంక్రాంతి వేడుకలు జరుపుకోవడం సంతోషాన్ని, సంతప్తిని ఇచ్చిందని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ అన్నారు. మండల పరిధిలోని పాత మాజేరులో కాలువ గట్టుపై నివసిస్తున్న గిరిజనులతో కలిసి సురేష్ బాబు సంక్రాంతి పండుగను జరుపుకున్నారు. వారికి మిఠాయిలు అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేత మద్దాల వెంకటేశ్వరరావు, ఆశ వర్కర్ కమ్మెల అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.



అసత్య ప్రకటనలపై యుటిఎఫ్ నిరసన

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ప్రభుత్వంలో భాగమైన ఉద్యోగులను శత్రువులుగా చూస్తూ తమకు రావలసిన బకాయిలను సైతం ప్రభుత్వం వాడుకుని బకాయిలు అడిగినందుకు తిరిగి ఉద్యోగ ఉపాధ్యాయుల పైనే అక్రమ కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ ప్రభుత్వం చేస్తున్న అసత్య ప్రకటన కాపీలను స్థానిక యూటీఎఫ్ కార్యాలయం వద్ద ఆదివారం వేసిన భోగి మంటల్లో వేసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కెఏఉమ మహేశ్వర రావు,జిల్లా ప్రధాన కార్యదర్శి జె.లెనిన్ బాబు లు మాట్లాడుతూ ప్రభుత్వంలో భాగమైన ఉద్యోగ, ఉపాధ్యాయులను,పెన్షనర్లకు రావలసిన బకాయిలను సైతం ప్రభుత్వం వాడుకుని బకాయిలు అడిగినందుకు తిరిగి ఉద్యోగ ఉపాధ్యాయుల పైనే అక్రమ కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పైగా తాము ఉద్యోగుల పక్షపాతం అని మోసపూరిత మాటలు చెబుతున్న ప్రభుత్వ వైఖరి ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రభుత్వ అణచివేత చర్యలు, అసత్య ప్రకటనలు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీ సి హెచ్ రాజా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉద్యోగ ఉపాధ్యాయ ఆర్థిక బకాయిలను చెల్లించాలని కోరుతూ అవనిగడ్డ ప్రధాన సెంటర్లలో యుటిఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షులు బి కనకారావు ఆధ్వర్యంలో తప్పుడు ప్రకటనల ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ఆదివారం ఉదయం భోగిమంటల సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ ఆనగడ్డ మండల శాఖ అధ్యక్షుడు కే జీవేంద్రరావు, మోపిదేవి మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఎం ఎన్ స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం పూర్ణచంద్రరావు, కొండవీటి అశోక్ సింహాద్రి, శ్రీనివాసరావు, బుజ్జిబాబు ,బండెల గోవర్ధన్ రావు, యాసం శోభన బాబు, బడే దాశరధి, ఎస్వీఆర్ కె నాగార్జున రామం తదితరులు పాల్గొన్నారు.



అవనిగడ్డలో జీవో ప్రతులు దహనం చేస్తున్న నాయకులు

కనకదుర్గ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ మాజీ ఎంపీపీ, టిడిపి తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు బండి నాగ వెంకట కనకదుర్గ జన్మదిన వేడుకలు టిడిపి కార్యాలయంలో మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదుర్గ చేత కేక్ కట్ చేయించి బుద్ధ ప్రసాద్ కుటుంబ సభ్యులు ఆమెకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బుద్ధ ప్రసాద్ సతీమణి విజయలక్ష్మి ,టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్ రామ్ దంపతులు, మోపిదేవి మాజీ ఎంపీపీ మోర్ల జయలక్ష్మి ,బండే రాఘవ తదితరులు పాల్గొన్నారు.



సాయం అందిస్తున్న శ్యామ్ కిషోర్‌నాయుడు

ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అవనిగడ్డ : నాగాయలంక మండల పరిధిలోని తలగడదీవి కొత్తపాలెం శివారు నారాయణ రావు పురం గ్రామానికి చెందిన మద్దాల శ్రీను ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్నాడు. ఇది తెలిసిన శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు తోట శ్యామ్ కిషోర్ నాయుడు శ్రీను కుటుంబాన్ని సందర్శించి ఆయనను పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం 7 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మే ఒడు లక్ష్మణరావు, బండ్ రెడ్డి, హరి, ప్రేమాల శ్రీనివాసరావు, మెండు శంకర్ పాల్గొన్నారు

జోరుగా జూద క్రీడలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు మండల పరిధిలో ఆదివారం కోడిపందేలు, జూదం, గుండాట పెద్దయెత్తున సాగాయి. అధికారపార్టీ నాయకుల ఆధ్వర్యంలో సందేలకు బరులువేసి, పేకాటకు గుడారాలు, టెంట్లు, ఫ్లడ్ లైట్ల వెలుగులతో నిర్వహించారు. లక్షల రూపాయలు చేతులు మారగా పందేలకు పలు ప్రాంతాలనుంచి పెద్దయెత్తున తరలివచ్చారు. పెద ఓగిరాల, ఆకునూరు, బోళ్ళపాడులో బరులు పందెంరాయుళ్లతో కిక్కిరిసాయి. ఎక్కువ పందేలు గెలిచిన వారికి బుల్లెట్ బహుమతి ప్రకటించారు. మూడురోజులపాటు జరిగే సోమవారం, మంగళవారం రెండురోజులపాటు జరిగే పందేలకు మరింతమంది తరలివస్తారని అంచనా కాగా అందుకు తగినట్టుగా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** మోపిదేవి మండలం మెపిదేవి, కోక్కిలగడ్డ వెళ్ళే రహదారి పక్కన ఏర్పాటు చేసిన బరిలో కోడిపందేల, జూదాలు జరిగాయి. నిన్నటి వరకు పోలీస్ ఉన్నతాధికారులు ఎక్కడా కోడిపందాలకు అనుమతి లేదని ఎవరైనా నిర్వహిస్తే కఠిన చర్య తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. కానీ భోగి పండుగ రోజునే పెద్ద ఎత్తున కోడి పందాలు నిర్వహిస్తుంటే పట్టించుకున్న వారే లేరని విమర్శలు వినిపిస్తున్నాయి. మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంకు, అలాగే స్థానిక పోలీస్ స్టేషన్ కు కూత వేటు దూరంలోనే కోడి పందాలు, జూదాలు జరుగుతున్నాయి. సుప్రసిద్ధ దేవాలయంకి ఇచ్చే గౌరవం ఇదేనా అని ఈ పండుగ సందర్భంగా ఆలయం కు విచేస్తున్న భక్తులు పోలీస్ శాఖ తీరుపై అసంతప్తి వ్యక్తం చేస్తున్నారు



ఉయ్యూరులో...

హరివిల్లులో సంక్రాంతి సంబరాలు

ప్రజావక్తి-కంకిపాడు : హరివిల్లు ప్రమోటర్స్ అండ్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు కంకిపాడు "సిగ్నేచర్ సిటీ" వెంచర్‌లో భోగి మంట లతో ఘనంగా ప్రారంభించారు. ఈ వేడుకలో హరివిల్లు ప్రమోటర్స్ అండ్ డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్ చైర్మన్ వేములపల్లి లక్ష్మణచౌదరి, రాధాకష్ణ, మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణచౌదరి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ప్రజలందరూ జరుపుకునే పెద్ద పండుగ సంక్రాంతి అని అందరూ సుఖ సంతోషాలతో ఈ పండుకుని జరుపుకోవాలని ఆకాంక్షించారు.



వైకాపాకి ఓటమి భయం : యార్లగడ్డ

ప్రజాశక్తి-గన్నవరం : వైకాపాకు ఓటమి భయం పట్టుకుందని టిడిపి గన్నవరం నియోజకవర్గ ఇన్చార్జి యార్లగడ్డ వెంకట్రావు విమర్శించారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... తెదేపాకు ప్రజల్లో లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక తన గుప్పెట్లో పెట్టు కున్న సీఐడీ ద్వారా చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టించారన్నారు. జగన్ అరాచకం, అక్రమాలు, అవినీతి ప్రతిమించిపోయాయన్నారు. సొంత పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలే ఆయన అహంకాంపూరిత చర్యలను నేడు బహిరంగంగా ఎత్తి చూపుతున్నారన్నారు. రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేసిన జగన్ రూ.4 లక్షల కోట్లు కొల్లగొట్టారని, 16 లిస్టెడ్ కంపెనీలు, మరో 50 సూట్కేస్ కంపెనీలు, 5 నగరాల్లో అదిరిపోయే ప్యాలెస్లు ఎలా వచ్చాయో చెప్పాలన్నారు.

రెండో రోజుకు తంబి ఉత్సవాలు



ప్రజాశక్తి-ఉంగుటూరు : బ్రదర్ జోసఫ్ తంబి మహనీయుడని తన సేవల ద్వారా ప్రజలను ఆకర్షించిన మహెూన్నత వ్యక్తి అని గుంటూరు బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య కొనియాడారు. బ్రదర్ జోసఫ్ తంబి 79వ వర్థంతి ఉత్సవాల నేపథ్యంలో రెండవ రోజైన ఆదివారం తిరునాళ్ల లో పాల్గొన్న భాగ్యయ్య మాట్లాడుతూ తంబి తన స్వగహంలో పలురకాల రోగులను స్వస్థపరిచాడని అన్నారు. అందుకే ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు పొందగలిగారని, క్రైస్తవ విశ్వాసులలో ఆయన ముఖ్యుడు గా నిలిచారని కొని యాడారు. పది ఆజ్ఞలను తూచా తప్పకుండా పాటించిన వ్యక్తిగా బ్రదర్ జోసఫ్ తంబి నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రవెన్షియల్ రెవ ఫాదర్ దాసు ప్రత్తిపాటి, పుణ్యక్షేత్ర డైరెక్టర్ విచారణ గురువులు పాలడుగు జోసెఫ్, రెవ: ఫాదర్ అభిలాష్ గోపు బిషప్ భాగ్యయ్యను దుస్సాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెవ ఫాదర్ ఇన్నయ్య పోలిశెట్టి తదితరులు పాల్గొన్నారు .ఈ తిరునాళ్ల సందర్భంగా సెయింట్ ఫ్రాన్సిస్, బ్రిందసీ సోదరులు భక్తి గీతాలు ఆలపించారు. పలు రకాలుగా బ్రదర్ జోసఫ్ తంబి సేవలను విశ్వాసులు భక్తులకు వివరించారు.

చర్చి నిర్మాణానికి సాయం


ప్రజాశక్తి- మోపిదేవి : మోపిదేవి పంచాయతీలోని బోడగుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న క్రీస్తు బాప్టిస్ట్ సంఘం చర్చికి శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు విరాళాన్ని అందజేశారు. చర్చి నిర్మాణానికి తన వంతుగా శ్యామ్ కిషోర్ ఆది వారం 15 వేల రూపాయలను సంఘం చైర్మన్ తేళ్ల బాబు, కార్య దర్శి కొమ్ము లాభానులకు అందించారు. ఈ కార్యక్రమంలో తోట నరసింహా నాయుడు, వెంకటాపురం గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ కొక్కిలిగడ్డ వరుణ్, సంఘం సభ్యులు కొక్కిలిగడ్డ రమేష్ బాబు, కొమ్ము ఇస్సాకు, అనపర్తి ప్రసాద్, సిహెచ్ యోబు పాల్గొన్నారు.

కార్యకర్తలు కలసికట్టుగా పనిచేయాలి : ఉమా

ప్రజాశక్తి-పమిడిముక్కల : రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తుందని టిడిపి నాయకులు దేవినేని ఉమా మహేశ్వరావు అన్నారు. ఆదివారం పమిడిముక్కల మండలం లోని వీరంకిలాకు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విస్తత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అవినీతి మోయమైందని ఆరోపించారు. కార్యకర్తలు అందరూ సమిష్టి కృషితో తెలుగుదేశం పార్టీ విజయాన్ని కృషి చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో పామర్రు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా, వెంకట గురుమూర్తి, మాజీ జెడ్పిటిసి మోటూరు వెంకటసుబ్బయ్య, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు, కొల్లూరు బాబ్జి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి ఆలయానికి హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి-మోపిదేవి : ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని ఆదివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జస్టిస్ వి శ్రీనివాస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు, ఆలయ పండితులు, అర్చక స్వాములు ఘన స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో పాలు పోసి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీ స్వామి వారిని దర్శించుకునగా, ఆలయ అర్చకులు వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జస్టిస్ వి శ్రీనివాస్ ని ఆలయ సహాయ కమీషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఆలయ మర్యాదలతో సత్కరించి, ప్రసాదాలను అందించారు.



భూహక్కు చట్టం ప్రతుల దహనం



గన్నవరంలో...



కంకిపాడులో...



తోట్లవల్లూరులో...

ప్రజాశక్తి-గన్నవరం : రైతులకు, ప్రజలకు నష్టం చేసే భూ యాజమాన్య హక్కుకు నిరసనగా ఆదివారం కరపత్రాలను భోగిమంటలలో వేసి గన్నవరంలో రైతులు నిరసన తెలిపారు. ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షులు సూరగాని సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటంలోకి రావాలని పిలుపునిచ్చారు. రాజేశ్వరరావు, మతాశివ శంకర్, నాగరాజు మరియు ఇతర రైతులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** కార్పొరేట్లకు భూమిని అప్పనంగా అప్పజెప్పేదాని కోసమే ప్రభుత్వం భూ హక్కుల చట్టం (ఏపీ టైటిలింగ్ యాక్ట్) అమలలోకి తీసుకొచ్చిందని, ఈ చట్టం వల్ల రైతులకు, ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని నమ్మపలుకున్న దానిలో వాస్తవం లేదని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు అన్నారు. కంకిపాడు మండలం గొడవర్రు గ్రామంలో జీవో నెంబర్ 572 ప్రతులను భోగి మంటలలో దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ చట్టం అమలులోకి వస్తే రాజకీయంగా పలుకుబడి కలిగినవారు పేదల, అసైన్డ్ ల్యాండ్స్ ను తమకు అనుకూలమైన వారికి బదలాయించుకొనె అవకాశం ఉందని, భూ యజమానులు ఈ సమస్యను హైకోర్టు దాకా వెళ్లి పరిష్కారం చేసుకోవటం సాధ్య పడదని అన్నారు. కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి వి మరియదాసు, సిఐటియు మండల కార్యదర్శి టి నరేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వైజోజి, కె బాబురావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** కార్పొరేటర్లకు భూమిని అప్పనంగా అప్పచెప్పేందుకే ఏపీ ప్రభుత్వం భూ హక్కు చట్టాన్ని తీసుకువచ్చిందని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు అన్నారు. భూహక్కుల చట్టాన్ని రద్దు చేయాలని ఆదివారం బొడ్డపాడు గ్రామంలో జీవో నెంబర్ 572 ప్రజలను భోగిమంటల్లో దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి వి శివశంకర్, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి వి మరియదాసు, సిఐటియు మండల కార్యదర్శి టి నరేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వైజోజి, కే శివశంకరరావు, బి శ్రీనివాసరావు ఎం నాగేశ్వరరావు, బి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

జోరుగా కోడిపందేలు

❑ మామిడి తోటలు, ఖాళీ ప్రదేశాల్లో బరులు ❑ విచ్చల విడిగా జూద క్రీడలు

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లాలో యథేచ్ఛగా కోడిపందేలను జరుగుతున్నాయి. ఉన్నత న్యాయస్థానాల తీర్పులు, అధికారుల ఆదేశాలు, కేసులు తదితర అంశాలను తుంగలో తొక్కి పందెం రాయుళ్లు వారి పని వారు చేసుకుంటున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు నియోజక వర్గాల్లో కోడి పందాలు నిర్వహిస్తున్నారు. పంట పొలాలు, మామిడి తోటలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు తదితర ప్రాంతాలను చదును చేసి కోడి పందేలకు వీలుగా ఉండేటట్టు బరులుగా మలిచారు. పగలే కాదు రాత్రి పూట పందేలు నిర్విరామంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు కూడా చేపట్టారు. జనరేటర్లు, ఫ్లడ్ లైట్లు వంటి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేపట్టారు. బరుల పక్కనే జూద శిబిరాలు వెలిశాయి. విచ్చల విడిగా గుండాట, పేకాట, లోపలా బయట, వంటి జూద క్రీడలు ఆడుతున్నారు. నందిగామ మండలం మున్నేటి తీరంలోని పల్లగిరి శివారు మామిడితోటలు, కంచికచర్ల మండలం గుండేపల్లి, చందర్లపాడు, నందిగామలో పలు ప్రాంతాల్లో బరులకు వేదికలుగా మారాయి. జగ్గయ్యపేట షేర్ మహమ్మద్ పేట, మంగొల్లు, చిల్లకల్లు, తిరుమలగిరి, అనుమంచిపల్లి, బూధవాడ, వత్సవాయి, తోటచర్ల, నవాబుపేట ప్రాంతాల్లో పెద్ద భారీ స్థాయిలోనే పందేలు నిర్వహిస్తున్నారు. పెనుగంజిప్రోలు మామిడితోటలు, ప్రైవేటు గార్డెన్లు, తిరువూరు ఆర్డీఓ కార్యాలయం, పశువుల సంత సమీపంలోనే బరులు ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఏకొండూరు మండలం గోపాలపురం, గంపలగూడెం మండలం ఉటుకూరు, కొణిజర్ల వంటి పలు చోట్ల పెద్ద ఎత్తున పోటీలు నిర్వహిస్తున్నారు.

కాగితాలకే పరిమితమైన నిఘా : కోడి పందేలు నిర్వహణ చట్ట విద్ధం కావడంతో దీనిని అడ్డుకోడానికి డిసెంబరు మాసం నుంచే చర్యలకు ఉపక్రమించారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడెక్కడ కోడి పందేలు జరిగే అవకాశం ఉందో ఆయా ప్రాంతాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి అడ్డుకునేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు హడావుడి చేశారు. దీని కోసం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఇబి), టాస్క్ ఫోర్సుతో పాటు ఇతర పోలీసు విభాగాలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడంతో పాటు గ్రామ, వార్డు వలంటీర్ల ద్వారా రహస్యంగా ముందస్తు సమాచారం సేకరణ చేపడుతున్నట్లు హడావుడి చేశారు. అవన్నీ కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శలు వినిపిస్తున్నాయి. **నందిగామ :** నందిగామ మండలం పల్లగిరి మామిడి తోటలు, ఐతవరం మామిడి తోటలలో అధికారికంగా కోడి పందాలు శిబిరాలు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. ఎంఎల్‌సి మొండితోక అరుణ్‌కుమార్, నందిగామ ఎఎంసి చైర్మన్ మస్తాన్‌లు పబ్లిక్‌గానే కోడి పందేల శిబిరాలు ప్రారంభించారు. **తిరువూరు :** తిరువూరు నియోజకవర్గంలో జోరుగా కోడి పందాలు కొనసాగుతున్నాయి. కానీ పోలీసులు తమకేమీ తెలియనట్లుగా వ్యవహరిస్తుండటం విశేషం. మొన్నటి వరకు పందాలు వేస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించిన పోలీసులు చివరకు వదిలేశారు. సంక్రాంతి పండుగ మూడు రోజుల పాటు పెద్ద ఎత్తున కోడి పందేలు నిర్వహించటానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కోడి పందేలను వీక్షించడానికి రెండు తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ నాయకులు, జూదగాళ్ళు తిరువూరు, కాకర్ల, మల్లెల, చీమలపాడు, నారికింపాడు, ఊటుకూరు తదితర ప్రాంతాల్లో నిర్వహించే కోడిపందాలకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈనేపథ్యంలో కోడి పందేల నిర్వాహకులు తమ పుంజులను బరిలోకి దించి రూ.లక్షల్లో పందాలు కాస్తున్నారు. **జగ్గయ్యపేట :** పట్టణంలోని సత్యనారాయణపురం, శాంతినగర్ ప్రాంతాల్లో, మండలంలోని చిల్లకల్లు, షేర్ మహమ్మద్ పేట, అనుమంచిపల్లి గ్రామ సమీపంలోని ఆదివారం భోగి పండుగ సందర్భంగా కోడి పందాలు విచ్చలవిడిగా నిర్వహించారు. కోడిపందాలు తోపాటు గుండ్లాట, లోపల బయట, పేకాట వంటివి నిర్వహించారు. కోడిపందాల కోసం ప్రత్యేకంగా స్తంభాలు పాతి ఫెన్సింగ్ వైరుతో బరులు సిద్ధం చేసి టెంట్లు వేసి నిర్వహించారు. లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు తెలుస్తుంది. **వత్సవాయి :** వత్సవాయిలో నాలుగు బరులు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క బరి నుండి రూ.30వేలు డిపాజిట్లు కట్టించుకొని వ ఆటలు నిర్వహిస్తున్నారు. **మైలవరం :** వారం రోజులుగా పోలీసులు చేస్తున్న హెచ్చరికలను బేఖాతరు చేస్తూ నియోజకవర్గంలో ఆదివారం కోడిపందేలు జోరుగా సాగాయి. కోసాట, నలుపు, ఎరుపు, పులి ఏనుగు గుర్రం, చిత్తాట తదితర జూద క్రీడలు జోరుగా సాగాయి. బరుల వద్ద మద్యం ఏరులై పారింది. ఒక రోజులోనే లక్షలాది రూపాయలు చేతులు మారాయి. పందేలను వీక్షించేందుకు తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా జూదరులు వచ్చారు. ముళ్లకంచెలు ఏర్పాటు చేసి పందేలు నిర్వహించడం గమనార్హం. **కంచికచర్ల :** కోర్టు ఆదేశాలు ఉన్నా, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, పోలీసులు కనుసన్నల్లో నందిగామ నియోజకవర్గం లో ఆదివారం యధేచ్ఛగా కోడి పందాల బారులు నిర్వహించారు. సంక్రాంతి క్రీడల పేరుతో కంచికచర్ల మండలం గండేపల్లి, నందిగామ మండలం ఐతవరం, పల్లగిరి, చందర్లపాడు పరిధిలో కోళ్ళకు కత్తులు కట్టి పందాలు నిర్వహించారు. కోడి పందాల బరుల్లో కోళ్ళ కు కత్తులు కట్టి పందాలు నిర్వహించారు. దీంతో కత్తులకు బలైన కోళ్ళు విలవిలలాడాయి. బరుల వద్ద కోళ్ళ నెత్తురు దారలా కారణంతో పందెం రాయుళ్లు, నిర్వాహకులు అమితానందం పొందారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కోళ్ళ పందాలు నిర్వహించవద్దని హైకోర్టు ఆదేశించింది. అయినా కోర్టు ఆదేశాలు పోలీసులు అమలు చేయలేదు. అధికార పార్టీ నేతలు, బరుల నిర్వాహకులకు పోలీసులు సలాం చేసి, బరుల వద్ద కాపలా కాశారని ప్రజలు అంటున్నారు. కంచికచర్ల మండలం గండేపల్లి బరివద్ద గుండాట లో లక్షలాది రూపాయలు చేతులు మారాయి. నిర్వాహకులు అమాయకులను మాయ చేసి పందెంలో నగదు దోచుకుంటున్నారని బాధితులు ఆరోపించారు. ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ కోళ్ళ పందాలను ప్రారంభించారు. బరుల వద్ద తెలంగాణ మద్యం ఏరులై పారింది. పేకాట, గుండాట, కోళ్ళ పందాలు ద్వారా తొలిరోజే లక్షలాది రూపాయలు చేతులు మారాయని ప్రజలు అంటున్నారు. కనీసం బరులవైపు, పోలీసులు, రెవిన్యూ అధికారులు కన్నెత్తి చూడకపోవటం దారుణమని ప్రజలు విమర్శిస్తున్నారు.



జగ్గయ్యపేటలో



అంబాపురంలో ఏర్పాటు చేసిన కోడిపందేల శిబిరం



కంచికచర్లలో

భోగి మంటలు...సంక్రాంతి ముగ్గులు...

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రిపై ఆదివారం అంగరంగ వైభవంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈరోజు భోగి సందర్భంగా ఉదయం ఆలయ స్థానాచార్యులు, వైదిక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి వేద మంత్రోచ్చారణాల నడుమ సాంప్రదాయబద్ధంగా గొబ్బెమ్మలు, గంగిరెద్దులు, హరిదాసులు, మేళతాళాలతో వైభవంగా భోగి మంటలు కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, కార్యనిర్వాహణాధికారి కెఎస్ రామరావు, స్థానాచార్యులు విష్ణుభట్ల శివప్రసాద శర్మ, కార్యనిర్వాహక ఇంజనీర్లు, వైదిక కమిటీ సభ్యులు, ఆలయ అధికారులు సిబ్బంది, యాత్రికులు పాల్గొని భోగి మంటలను వెలిగించారు. బొమ్మల కొలువును ఆలయ ఇఓ రామారావు ప్రారంభించారు. సాయంత్రం చిన్నారులకు భోగిపళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు విష్ణుభట్ల శివప్రసాద శర్మ, పాలక మండలి సభ్యులు, వైదిక కమిటీ సభ్యులు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి వార్లు, పర్యవేక్షకులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రంగనాథస్వామి కళ్యాణం : సంక్రాంతి సందర్భంగా ధనుర్మాస దీక్షలో భాగంగా చిట్టినగర్ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం గోదా రంగనాథస్వామి కళ్యాణం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. గోదా రంగనాథ స్వామి కళ్యాణాన్ని శ్రీ పద్మావతి గోదాదేవి సమేత గరుడాచల స్థిత వెంకటేశ్వర స్వామి వారి దేవాలయ కళ్యాణ మండపంలో అంగరంగ వైభవపీతంగా 25 మంది ఉభయ దాతలచే నిర్వహించారు. గోదా కష్ణ వేషధారణ చేసిన సుమారు 100 చిన్నారులకు ఆస్థాన మండపంలో శ్రీకష్ణ స్వామి సమేతంగా భోగిపళ్ళను పోశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వినుకొండ రత్నమాచార్యులు, ఆలయ సహాయ అర్చకులు శ్రీనివాసుల గోపాల్ చేతుల మీదుగా ఆలయ కమిటీ అధ్యక్షులు లింగపల్లి అప్పారావు, కోశాధికారి పిళ్ళా శ్రీనివాస్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. **విస్సన్నపేట, వత్సవాయి :** లింగాల గ్రామంలో గ్రామ సెంటర్లో సజన ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు 100 మంది పాల్గొని గొబ్బెమ్మలతో, పూలతో రంగవల్లులు అలంకరించి సంక్రాంతి పండుగ దృశ్యాన్ని ముగ్గులతో చిత్రీకరించారు. **జగ్గయ్యపేట:** మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో బాల బాలికలకు భోగి పండుగ పోశారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 40 సంవత్సరాలుగా గ్రామస్థాయిలో ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఖమ్మం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కాసరగడ్డ దీప అన్నారు. మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా 'సంక్రాంతి ఆటలు యువజన మైత్రికి బాటలు' అనే నినాదంతో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఆవాజ్, ప్రజానాట్యమండలి సంయుక్తాధ్వర్యంలో గ్రామస్థాయి ఆటల పోటీలలో భాగంగా ఆదివారం కబడ్డి పోటీలను ప్రముఖ సీనియర్ న్యాయవాది కాసరగడ్డ నాగేశ్వరరావుతో కలిసి దాసరిగడ్డ దీప ప్రారంభించారు. **మైలవరం :** సంక్రాంతి పర్వ దినాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు గృహాల ముందు రంగవల్లులు వేసి పూలతో అలంకరించి గొబ్బెమ్మలు చేసి భోగి పళ్ళు పోశారు. **కంచికచర్ల :** కంచికచర్ల మండలం లో భోగి పండుగ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. చిన్న పిల్లలకి భోగి పళ్ళు పోశారు. **అజిత్ సింగ్ నగర్ :** ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పిల్లలకు భోగిపళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీదేవి, సిఐటియు నాయకులు రాంబాబు అమ్ములు మహిళలు తదితరు పాల్గొన్నారు. 57వ డివిజన్ సుందరయ్య కాలనీలో సంక్రాంతి పండగ సందర్భంగా విజేతలకు సిపిఎం రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు విజేతలకు బహుమతులు అందజేశారు. **అజిత్ సింగ్ నగర్ :** ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కండ్రిక లో ఆటలపోటీలు మహిళలకు ముగ్గులు పోటీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో విజేతలకు సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్ బాబురావు విజేతలకు బహుమతులు అందజేశారు. బి.రమణారావు నాగార్జున పబ్లిక్ స్కూల్ ఎమ్‌డి, సిఐటియు నాయకురాలు ఝాన్సీ సీనియర్ నాయకులు స్వామి రెడ్డి వెంకట్ రెడ్డి పిచ్చమ్మ జి.లత జి.సావిత్రి తదితరులు పాల్గొన్నారు. **మధురానగర్‌లో** ఆట పాట ఐద్వా, డివైఎఫ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు సిపిఎం రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి సిహెచ్ బాబురావు పాల్గొని సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. **నందిగామ :** నందిగామ పట్టణ శివారు పల్లగిరి వద్ద – ఐతవరం వద్ద ఏర్పాటుచేసిన సంక్రాంతి వేడుకలను ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ ఆదివారం ప్రారంభించారు. సంక్రాంతి పండుగను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని కోరారు. **విజయవాడ :** ఐద్వా, డివైఎఫ్ఐ, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంక్రాంతి ఆటలు పోటీలు జరిగాయి. విజేతలకు బహుమతులను అందజేశారు. కృష్ణలంకలోని 22వ డివిజన్, రాణిగారితోట 17వ డివిజన్లలో వివిధ ఆటల పోటీలు ఆదివారం ఘనంగా జరిగాయి. చిన్నారులు, విద్యార్థినీ, విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కుండకొట్టుడు, ముగ్గుల పోటీలు, వ్యాసరచన, మెమరిటెస్ట్ తదితర ఆటలు జరిగాయి. ఆయా సెంటర్లలో జరిగిన కార్యక్రమాల్లో 350 మందికి పైగా చిన్నారులు, యువతీ, యువకులు పాల్గొన్నారు. కార్యక్రమాన్నుద్దేశించి డివైఎఫ్ఐ జిల్లా అద్యక్షులు పి.కృష్ణ మాట్లాడారు. డివైఎఫ్ఐ 22వ డివిజన్ కార్యదర్శి బత్తుల ఉమామహేశ్వరరావు, అధ్యక్షులు జె కొండ, నాయకులు అంజిబాబు, శ్రీను, రాణిగారితోటలో జరిగిన కార్యక్రమంలో విజయపబ్లిక్‌స్కూల్ డైరెక్టర్ సిహెచ్ వెంగళరెడ్డి, నాయకులు టి.చంద్రశేఖర్, వై.కృష్ణ, ఎ.కోటిరెడ్డి, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. రాజీవ్ నగర్ కండ్రిక హెచ్.కాలనీ మధురానగర్ రాజరాజేశ్వరి పేట దుర్గాపురం హెచ్‌కాలనీలో సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కార్యదర్శి సిహెచ్ బాబురావు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆటలు పోటీలలో ముగ్గుల పోటీలలో పాల్గొని విజేత అయిన వారికి బహుమతులు అందజేశారు.



దుర్గగుడిలో భోగిమంటలు వెలిగిస్తున్న ఆలయ ఇఓ రామారావు



గోదా రంగనాథ స్వామి కళ్యాణంలో దేవాలయ అధ్యక్షులు లింగిపిల్లా అప్పారావు, కోశాధికారి పిళ్ళా శ్రీనివాసరావు



సింగ్‌నగర్‌లో విజేతలకు బహుమతులందజేస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు